CELEBRATING 11TH YEAR ANNIVERSARY
ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 9 సంచిక : 52 పేజీలు :12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ బుధవారం 29 అక్టోబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :9 ISSUE : 52 PAGES :12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA WED 29 OCTOBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## తరుముకొస్తున్న 'మొంథా' తీవ్ర తుపాను..

### పవన్ కల్యాణ్ తో కలిసి సీఎం చంద్రబాబు సమీక్ష



- ప్రభావిత ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణకు అధికారులకు ఆదేశాలు
- అర్ధరాత్రి కాకినాడ సమీపంలో తుపాను తీరం దాటే అవకాశం
- డ్రోన్ల ద్వారా ముంపు ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచన
- ఇప్పటికే 43 వేల హెక్టార్లలో పంట నీట మునిగినట్లు అంచనా
- రహదారులకు అడ్డంకులు లేకుండా చూడాలని అధికారులకు పవన్ కల్యాణ్ ఆదేశం

**పెన్ పవర్ డెస్క్:**బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తీవ్ర తుపాను కోస్తాంధ్ర తీరంవైపు దూసుకొస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. తుపాను ప్రభావిత ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులను, అధికారులను

వివరాలు 2లో..




# ఏపీని వణికిస్తున్న మొంథా తుపాను..

### అరకు ఘాట్‌లో వరద బీభత్సం, ప్రకాశం జిల్లాలో కొట్టుకుపోయిన కారు

- మొంథా తుపాను ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు
- అల్లూరి జిల్లాలో అరకు ఘాట్ రోడ్డుపై ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వరద
- సుంకరమెట్ట వద్ద వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- ప్రకాశం జిల్లాలో ఉప్పొంగిన వాగులో కొట్టుకుపోయిన కారు
- డ్రైవర్ సురక్షితంగా బయటపడటంతో తప్పిన ప్రాణనష్టం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:**కాకినాడ-మచిలీపట్నం మధ్య మొంథా తుపాను తీరం దాటే ప్రక్రియ మొదలైంది. తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలు అతలాకుతలం అవుతున్నాయి. కుండపోత వర్షాల కారణంగా వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో జనజీవనం స్తంభించిపోయింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అరకు ఘాట్ రోడ్డుపై వరద నీరు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండగా, ప్రకాశం జిల్లాలో ఓ కారు వాగులో కొట్టుకుపోయింది.

**అరకు ఘాట్‌పై నిలిచిన రాకపోకలు**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఏజెన్సీ ప్రాంతం తడిసి ముద్దయింది. వాగులు పొంగి ప్రవహిస్తుండటంతో అరకు వ్యాలీ-విశాఖపట్నం మధ్య ఘాట్ రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. ముఖ్యంగా సుంకరమెట్ట కాఫీ తోటలు, అనంతగిరి మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్డుపై వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాణాలను పణంగా పెట్టి కొందరు వాహనదారులు రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అధికారులు అప్రమత్తమై, అనవసర ప్రయాణాలు మానుకోవాలని ప్రజలకు సూచనలు జారీ చేశారు.

**ప్రకాశం జిల్లాలో వాగులో కొట్టుకుపోయిన కారు**

ఇదిలా ఉండగా, ప్రకాశం జిల్లాలోనూ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఒంగోలు సమీపంలోని యరజర్ల-వెంగముక్కలపాలెం మధ్య ఉన్న వాగు ఉప్పొంగి ప్రవహించడంతో ఓ కారు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. అకస్మాత్తుగా పెరిగిన వరద తీవ్రతకు కారు అదుపుతప్పి వాగులోకి జారిపోయింది. అయితే, డ్రైవర్ అప్రమత్తమై వెంటనే కారులో నుంచి బయటకు రావడంతో ప్రాణనష్టం

తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. రానున్న గంటల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని జిల్లా యంత్రాంగం హెచ్చరించింది.

### ప్రజా వ్యతిరేక పాలకులు

## ఈసారి ఇంటికే



- డీఎంకే ప్రభుత్వంపై నటుడు, టీవీకే అధినేత విజయ్ తీవ్ర విమర్శలు
- కావేరి డెల్టా రైతుల విషయంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ
- ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో పంటలు నీటిపాలయ్యాయని ధ్వజం
- మొలకెత్తిన ధాన్యంతో ప్రభుత్వ వ్యతిరేకతను పోల్చిన విజయ్
- రైతులను ఆదుకోవడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఏటా ఇదే దుస్థితి పునరావృతమవుతోందని ఫైర్

వివరాలు 2లో..

## మావోయిస్టు పార్టీలో.. అంతర్గత చీలికలు



**పెన్ పవర్ డెస్క్:** తాము పోలీసులకు లొంగిపోలేదని, తమ సిద్ధాంతాన్ని ఓడించడం ఎవరి తరమూ కాదని మావోయిస్టు పార్టీ అగ్రనేత చంద్రన్న అభియాన్ ప్రసాదరావు అన్నారు. డీజీపీ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు. తాము ప్రజల మధ్య ఉండి ప్రజల కోసం పనిచేస్తామని వెల్లడించా రు. మావోయిస్టు పార్టీలో అంతర్గత బిలికలు వచ్చా యని చెప్పారు. తమది లొంగుబాటు కాదని, అభి వృద్ధిలో కలిసి పనిచేసేందుకు నిర్ణయం తీసుకొనే వచ్చామని చెప్పారు. ఇప్పటి వరకు ఉద్యమంలో

వివరాలు 2లో..

## టెట్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేస్తాం

- సచివాలయంలో మంత్రి లోకేశ్ ను కలిసిన టీడీపీ ఎమ్మెల్సీలు
- సుప్రీం తీర్పుపై ఉపాధ్యాయుల ఆవేదనను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన నేతలు
- 2010కు ముందు నియమితులైన టీచర్లపై తీర్పు ప్రభావం
- సుప్రీం ఉత్తర్వుల మేరకు ఇప్పటికే టెట్ నోటిఫికేషన్ జారీ
- టెట్ నిర్వహిస్తూనే, ఉపాధ్యాయుల కోసం న్యాయపోరాటం చేస్తామన్న మంత్రి

వివరాలు 2లో..



## ట్రంప్ కు పుతిన్ షాక్.. ఫ్లుటోనియం ఒప్పందం రద్దు


- 2016 లో ఒబామా హయాంలోనే ఈ ఒప్పందం నిలిపివేసిన పుతిన్
- తాజాగా ఈ ఒప్పందాన్ని శాశ్వతంగా రద్దు చేస్తూ సంతకం
- ఉక్రెయిన్ తో యుద్ధం విషయంలో పుతిన్ పై ట్రంప్ ఆగ్రహం

వివరాలు 2లో..



## భీకర తుఫాన్ గా మోంథా

- మోంథా తుఫాన్ ఎఫెక్ట్: కాకినాడకు గ్రేట్ డేంజర్ సిగ్నల్
- కాకినాడ పోర్టులో 10వ నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ
- విశాఖ, గంగవరం, భీమునిపట్నం, కళింగపట్నంలో 9వ డేంజర్ సిగ్నల్ జారీ
- మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం ఓడరేవులకు 8వ నెంబర్ ప్రమాద హెచ్చరికలు జారీ



**పెన్ పవర్ డెస్క్:**తుఫాన్ మోంథా భీకరంగా మారింది. తీవ్ర తుఫాన్ గా తీరం దాటనుంది. భయంకరమైన గాలులు తీరాన్ని అల్లకల్లోలం చేయనున్నాయి. తీవ్ర తుఫాన్ గా మోంథా తీరం దాటనున్నట్లు.. 2025, అక్టోబర్ 28వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు ప్రకటించింది భారత వాతావరణ శాఖ. భీకర తుఫాన్ మోంథా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మచిలీపట్నం.. కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరం దాటనున్నట్లు ప్రకటించింది. తీరం దాటే సమయంలో 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతోపాటు అతి భారీ వర్షాలు పడనున్నట్లు వెల్లడించింది.

**హైదరాబాద్‌తో పాటు తెలంగాణలో ఈ జిల్లాల్లో వర్షాలు..**

మోంథా తుఫాన్ ఎఫెక్ట్ తో ఆంధ్రప్రదేశ్ తో పాటు ఇటు తెలంగాణలోని పలుజిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని

వివరాలు 2లో..



## మొంథా తుపాను... కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ కీలక ఆదేశాలు

- దక్షిణ మధ్య, ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎంలతో అశ్వినీ వైష్ణవ్ వీడియో కాన్ఫరెన్స్
- తెలుగు రాష్ట్రాలు, ఒడిశాలో డివిజనల్ వార్ రూమ్‌ల ఏర్పాటుకు ఆదేశం
- విజయవాడ, విశాఖ, గుంటూరు డివిజన్లలో సిబ్బందిని సిద్ధం చేయాలని సూచన

వివరాలు 2లో..

## తుపాను బాధితులకు సాయం చేయండి

### కాంగ్రెస్ శ్రేణులకు షర్మిల దిశానిర్దేశం

- మొంథా తుపానుపై షర్మిల స్పందన
- సహాయక చర్యల్లో పాల్గొనాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు
- రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అండగా నిలవాలని సూచన




**పెన్ పవర్ డెస్క్:** మొంథా తుఫాను సృష్టిస్తున్న విపత్కర పరిస్థితుల్లో ప్రభావిత ప్రాంత ప్రజలకు అండగా నిలవాలని ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. తుపాను ప్రభావంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్

వివరాలు 2లో..

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

- 8వ కేంద్ర వేతన సంఘం విధివిధానాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల పెంపుపై సిఫార్సులు
- నియామకం జరిగిన 18 నెలల్లోగా కమిషన్ నివేదిక సమర్పణ
- దేశ ఆర్థిక పరిస్థితి, రాష్ట్రాలపై ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోనున్న సంఘం
- సుమారు 50 లక్షల ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం
- 2026 జనవరి 1 నుంచి సిఫార్సులు అమల్లోకి వచ్చే అవకాశం

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# చంద్రబాబు పార్టీ అంశాలపై దృష్టి
# వార్నింగా... యాక్షనా...

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనను ముగించుకుని అమరావతికి చేరుకున్నారు. కృష్ణా? జిల్లాలో నేతల మధ్య విభేదాలపై చంద్రబాబు ఫోకస్ పెట్టే అవకాశముంది. ప్రధానంగా తిరువూరు నియోజకవర్గం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిల మధ్య వివాదం రోడ్డున పడింది. ఒకరిపై ఒకరు బురద జల్లుకోవడంతో పార్టీని బాగా డ్యామేజీ చేసింది. విదేశాల్లో ఉన్నప్పుడే చంద్రబాబు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఫోన్ చేసి ఎవరినీ పిలిపించి మాట్లాడవద్దని, తాను వచ్చిన తర్వాత ఇద్దరి విషయంలో చర్యలు తీసుకుంటానని చెప్పారు. దీంతో చంద్రబాబు రాకతో ఎవరిపై చర్య చంద్రబాబు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. చంద్రబాబు స్టయిల్ ఆఫ్ యాక్షన్స్ దగ్గర నుంచి చూసిన వారికి ఎవరికైనా .. ఎవరిపైనా చర్యలు ఉండే అవకాశాలు ఉండవన్నది ఒక వాదన. ఆయన పార్టీ అధినేతగా ఇప్పటి వరకూ పార్టీ నుంచి సస్పెన్షన్ చేసిన నేతలు చాలా తక్కువ. పార్టీలు మారినప్పుడే వారిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు తప్పించి, ఇలాంటి వివాదాల విషయంలో ఆయన నేరుగా యాక్షన్ కు దిగే అవకాశం లేదన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న టాక్. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై పార్టీ సస్పెన్షన్ వేటు వేయడానికి లైంగిక వేదింపులే కారణం తప్ప పార్టీ విషయంలో రచ్చ కెక్కడం మాత్రం కాదు. ఇప్పుడు తిరువూరు విషయంలోనూ ఇద్దరు నేతలకు హెచ్చరికలతో సరిపెడతారన్నది ఎక్కువ మంది నేతల అభిప్రాయంగా కనిపిస్తుంది. ఎందుకంటే ఇద్దరు నేతలు.. సామాజికవర్గం పరంగా చూస్తే గట్టి వారే. ఇటు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు దళిత వర్గానికి చెందినవారు. ఆయనపై చర్య తీసుకుంటే అది తప్పుడు సంకేతాలు వెళతాయని చంద్రబాబు భావించే అవకాశాలున్నాయి. ఇప్పటికే పలుమార్లు వివాదాల్లో చిక్కుకున్న కొలికపూడి శ్రీనివాసరావును హెచ్చరించి పంపారు తప్పించి చర్యలకు దిగకపోవడాన్ని కొందరు ఈ సందరరేగా గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు కూడా యాక్షన్ ఇలాగే ఉంటుందని అంటున్నారు. ఇక విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని కృష్ణా? జిల్లాలో బలమైన సామాజికవర్గానికి చెందిన వారు కావడం, అందులోనూ ఆయన ఎంపీగా ఉండటంతో ఆయనకు కూడా హెచ్చరికలతో సరిపెడతారంటున్నారు. చంద్రబాబు కేవలం ప్రకటనల్లో మాత్రమే సస్పెన్షన్ అంటూ హెచ్చరిస్తారని, చేతలకు వచ్చేసరికి కమిటీ వేసి ఆ వివాదం సమసిపోయేలా చేయడంలో దిట్ట అని సీనియర్ నేతలే అంటున్నారు. మొత్తం మీద చంద్రబాబు దృష్టి పెట్టి తిరువూరు సమస్యకు చెక్ పెట్టే అవకాశాలున్నాయి. అంతే తప్ప యాక్షన్ కు దిగే అవకాశాలు మాత్రం లేవన్నది వాస్తవం.

# టెట్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేస్తాం

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ తీర్పుతో ఉపాధ్యాయుల్లో నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

మంగళవారం నాడు సచివాలయంలో మంత్రి లోకేశ్ ను టీడీపీ ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ కలిశారు. 2010 అక్టోబర్ 23కు ముందు డీఎస్సీల ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు సుప్రీంకోర్టు తీర్పుతో తీవ్ర ఆందోళన చెందుతున్నారని, వారి తరఫున ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలని వారు మంత్రిని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, 2025 సెప్టెంబర్ 1 నాటికి ఐదేళ్ల కంటే ఎక్కువ సర్వీస్ ఉన్న ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు తప్పనిసరిగా టెట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది. ఈ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 24న టెట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. 20 నుంచి 25 ఏళ్లుగా సర్వీసులో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులు సైతం ఇప్పుడు టెట్ పాస్ కాకపోతే అనర్హులుగా మారే ప్రమాదం ఉందని, ఇది వారిని తీవ్ర ఆవేదనకు గురిచేస్తోందని ఎమ్మెల్సీలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా, ఐదేళ్ల లోపు సర్వీస్ ఉన్నవారు ప్రమోషన్లు పొందాలన్నా టెట్ తప్పనిసరి అని పేర్కొన్న విషయాన్ని కూడా వారు వివరించారు. ఎమ్మెల్సీలు చెప్పిన విషయాలపై స్పందించిన మంత్రి లోకేశ్, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం టెట్ నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అదే సమయంలో, ఉపాధ్యాయుల ఆకాంక్షలు, వారి సర్వీసును గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో కచ్చితంగా రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

# ట్రంప్ కు పుతిన్ షాక్.. ప్లుటోనియం ఒప్పందం రద్దు

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు రష్యా ప్రెసిడెంట్ వ్లాదిమిర్ పుతిన్ గట్టి షాకిచ్చారు. ఉక్రెయిన్ తో యుద్ధాన్ని ఆపేయాలన్న తన సూచనను పెడచెవిన పెట్టాడని పుతిన్ పై ట్రంప్ ఇప్పటికే ఆగ్రహంగా ఉన్నారు. ఈ క్రమంలోనే అమెరికాతో గతంలో రష్యా కుదుర్చుకున్న ప్లుటోనియం ఒప్పందాన్ని పుతిన్ రద్దు చేసుకున్నారు. దీనికి సంబంధించిన చట్టంపై తాజాగా పుతిన్ సంతకం చేశారు. ఈ పరిణామం మళ్లీ అణు ఉద్రిక్తతలకు దారితీస్తుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

**ఒబామా హయాంలోనే..**

2000 సంవత్సరంలో అమెరికా, రష్యాల మధ్య ప్లుటోనియం నిర్వహణపై ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత 2010లో ఈ ఒప్పందాన్ని సవరించారు. దీని ప్రకారం.. రష్యా తమ వద్ద నిల్వ ఉన్న 34 మెట్రిక్ టన్నుల ప్లుటోనియంను అణ్వాయుధాల తయారీకి వాడకూడదు. ఈ నిల్వలను పౌర అణు విద్యుత్ తయారీ కోసం వినియోగించుకోవాలని ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. దీంతో దాదాపు 17 వేల అణ్వాయుధాల తయారీని అడ్డుకున్నట్లు అప్పట్లో అమెరికా అధికారులు పేర్కొన్నారు. అయితే, ఒబామా హయాంలో 2016 సంవత్సరం అమెరికా, రష్యాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. దీంతో ప్లుటోనియం ఒప్పందాన్ని పుతిన్ నిలిపివేశారు. తాజాగా ఈ అగ్రిమెంట్‌ను పూర్తిగా రద్దు చేసుకుంటూ చట్టంపై సంతకం చేశారు.

# మొంథా తుపాను... కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ కీలక ఆదేశాలు

'మొంథా' తీవ్ర తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో భారత రైల్వే శాఖ అప్రమత్తమైంది. తక్షణ చర్యలు చేపట్టేందుకు వీలుగా తెలుగు రాష్ట్రాలు, ఒడిశాలో డివిజనల్ వార్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాలైన దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైల్వే శాఖ సర్వసన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రత్యేకించి విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం డివిజన్ల పరిధిలో అవసరమైన యంత్రాలు, సామగ్రితో పాటు సిబ్బందిని తక్షణమే అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. తుపాను వల్ల ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి తీసుకుంటున్న చర్యలపై అధికారుల నుంచి నివేదిక కోరారు. తుపాను పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే తక్షణం స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. తుపాను కారణంగా రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని కూడా ఆయన పేర్కొన్నారు.

# మావోయిస్టు పార్టీలో.. అంతర్గత చీలికలు

- మొదటి పేజి తరువాయి

తాము పీడిత ప్రజల కోసం పనిచేశామని, భవి ష్యత్తు లోనూ పీడిత ప్రజల కోసమే పనిచేస్తామని చెప్పారు. పార్టీకి ఆయుధాలు అప్పగించి వచ్చామ ని చెప్పారు. మావోయిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా దేవ్ జీ ఎన్నుకున్నారని తెలిపారు. తాను దేవ్ జీని సపోర్ట్ చేస్తున్నట్టు తెలిపారు. దేశమంతా మావో ఐడియాలజీతోనే ఉందని తాము ప్రజల మధ్య ఉండి అదే ఐడియాలజీతో పనిచేస్తామని చెప్పారు. అనారోగ్యం సమస్యలతో లొంగిపోవాల్సి వచ్చిం దని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు పార్టీని వీడాల్ని వచ్చిందని వివరించారు.

**లొంగిపోతే చర్యలుండవ్: డీజీపీ**

జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులపై ఎలాంటి చర్యలు ఉండవని తెలంగాణ డీజీపీ శివధర్రెడ్డి స్పష్టం చేశారు. మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ ప్రకాశ్ తో కలిసి మరో కీలక నేత పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయారు. 1980లో పుల్లూరి ప్రసాదరావు కిషన్ అనుచరుడిగా మారారు. 1981లో పీపుల్స్ వార్? లో చేరారని డీజీపీ చెప్పారు. 1983లో కమాండర్ అయ్యారని,1992లో ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారనిఅన్నారు. 2008లో మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీసభ్యుడయ్యారని, 17 ఏళ్ల పాటు మావోయిస్టు పార్ట్ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా ఉన్నారని తెలిపారు. సీఎం రేవంత్రెడ్డి పిలుపుతో పుల్లూరి ప్రసాదరావు లొంగిపోయార ని డీజీపీ తెలిపారు. మావోయిస్టు మరో నేత బండ ప్రకాశ్ అలియాస్ ప్రభాత్ 45 ఏళ్లు వివిధ స్థాయిల్లో పనిచేశార న్నారు. అతని స్వస్థలం మందమర్రి. ఏడో తరగతి చదువుతున్నప్పుడే నక్సలి జం వైపు ఆకర్షితులయ్యారని అన్నారు. 2004లో జరిగిన శాంతి చర్చల్లో ప్రకాశ్ పాల్గొన్నారని వివరించారు. 2014లో స్టేట్ కమిటీ సభ్యుడయ్యారు. నేషనల్ పార్క్ ఏరియా కీలక ఆర్గనైజర్ బాధ్యతలు నిర్వహించారని వివరించారు. బండ ప్రకాశ్పై ఉన్న రూ.20లక్షల రివార్డు ఆయనకు ఇస్తామని తెలిపారు. పుల్లూరి ప్రసాదరావుపై ఉన్న రూ.25లక్షల రివార్డు ఆయనకు ఇవ్వనున్నట్టు చెప్పారు. తెలంగాణకు చెందిన ఇంకా 64 మంది మావోయిస్టులు కొనసాగుతు " న్నారని, పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు నేతలపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ కరెక్ట్ కాదని అన్నారు. అవసరమైతే వారికి రక్షణ కల్పిస్తామని డీజీపీ తెలిపారు.

# తరుముకొస్తున్న 'మొంథా' తీవ్ర తుపాను..

- మొదటి పేజి తరువాయి

ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా వాగులు ఆకస్మికంగా పొంగిపొర్లే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం అమరావతిలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి మొంథా తుపాను ప్రభావం, ప్రభుత్వ సన్నద్ధతపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

**తీరం దాటే ప్రాంతంపై ప్రత్యేక దృష్టి**

ప్రస్తుతం మొంథా తుపాను అత్యంత వేగంగా తీరానికి సమీపిస్తోందని, ఈ అర్ధరాత్రికి కాకినాడకు దక్షిణంగా తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇప్పటికే కాకినాడ, మచిలీపట్నం, విశాఖపట్నం సహా పలు తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, తుపాను తీరం దాటే అవకాశం ఉన్న కాకినాడ పరిసర ప్రాంతాలకు తక్షణమే మరిన్ని ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను తరలించాలని ఆదేశించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యంత్రసామాగ్రి, కమ్యూనికేషన్ పరికరాలు, అత్యవసర బృందాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గడచిన అనుభవాలను, ముఖ్యంగా హుద్‌హుద్ తుపాను సృష్టించిన విధ్వంసాన్ని గుర్తుచేసుకుంటూ, అప్పటి స్ఫూర్తితో కేవలం నాలుగు రోజుల్లోనే ప్రజలను గట్టెక్కించామని, అదే పట్టుదలతో ఇప్పుడు పనిచేయాలని పిలుపునిచ్చారు.

**క్షేత్రస్థాయిలో పక్కా సమాచారం ఉండాలి**

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎంత విస్తీర్ణంలో నీరు నిలిచింది, ఏయే వాగులు పొంగే ప్రమాదం ఉందో కచ్చితమైన అంచనాలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా క్షేత్రస్థాయి నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సోమవారం నుంచి భారీ వర్షాలు నమోదవుతున్నందున ఎర్రకాలువకు ఎగువ నుంచి ఆకస్మిక వరద ప్రవాహం వచ్చే ప్రమాదం ఉందని, ఆ ప్రాంతంలో అధికార యంత్రాంగం పూర్తి సన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.

**డ్రోన్లతో పర్యవేక్షణ, తక్షణ పునరుద్ధరణ**

తుపాను ప్రభావంతో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 43 వేల హెక్టార్లలో పంట నీట మునిగిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా కోనసీమ, ప్రకాశం, నంద్యాల, కడప, తూర్పుగోదావరి జిల్లాల్లో పంట నష్టం ఎక్కువగా ఉందని వివరించారు. ఈ సందర్భంగా పంట నష్టం వివరాలను రైతులు నేరుగా ప్రభుత్వానికి పంపేలా వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్‌లో మార్పులు చేయాలని సీఎం సూచించారు.

డ్రోన్ల ద్వారా ముంపు ప్రాంతాలను, గాలుల కారణంగా కూలిపోయిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, టవర్లను గుర్తించి తక్షణమే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుపాను ప్రభావిత జిల్లాల్లోని 1.92 కోట్ల మందికి మొబైల్ ఫోన్ల ద్వారా హెచ్చరిక సందేశాలు పంపామని, 2,703 జనరేటర్లను సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. అత్యవసర కమ్యూనికేషన్ కోసం పోలీస్ శాఖ 81 టవర్లతో వైర్‌లెస్ వ్యవస్థను ఏర్పాటు చేసిందని వివరించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. తుపాను కారణంగా రోడ్లపై చెట్లు, స్తంభాలు కూలిపోయి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు... అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో తాను ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నానని, యంత్రాంగమంతా క్షేత్రస్థాయిలో ఉందని మంత్రి నారా లోకేశ్ సీఎంకు తెలిపారు. రాయలసీమలో ప్రస్తుతం వర్షాలు లేనందున కృష్ణా నది ప్రవాహాలను అక్కడి చెరువులకు మళ్లించి, ఒక్క టీఎంసీ నీటిని కూడా వృథా చేయవద్దని జలవనరుల శాఖ అధికారులకు చంద్రబాబు సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు అనిత, నారాయణ, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భీకర తుఫాన్ గా మొంథా

- మొదటి పేజి తరువాయి

వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అక్టోబర్ 28న తీరం దాటిన తుఫాన్ కారణంగా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ఉన్నట్లుగా హెచ్చరించింది. అందులోభాగంగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో తదుపరి 2-3 గంటల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఇటు హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది వాతావరణ కేంద్రం. హన్మకొండ, హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, జోగులాంబ గద్వాల్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్ నగర్, మెదక్, నాగర్ కర్నూల్, నారాయణపేట, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో తదుపరి 2-3 గంటల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని చెప్పారు.

సహాయక చర్యల్లో 11 NDRF ,12 SDRF బృందాలు

సహాయ చర్యలు వేగవంతం చేసింది ఏపీ ప్రభుత్వం. ఆంధ్రప్రదేశ్ అంతటా 11 NDRF ,12 SDRF బృందాలు సిద్ధం చేసింది. పడవలు, లైఫ్ జాకెట్లు, OBMలు, ఈతగాళ్ళు ,వైద్య కిట్లతో ప్రతి సహాయక బృందాలు రెడీగా ఉన్నాయి. రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ 24 గంటలూ పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లను అందుబాటులో ఉంచింది. అత్యవసర అంబులెన్స్ నెట్‌వర్క్లు, 108 ,104 వాహనాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి.

**కాకినాడకు డేంజర్ సిగ్నల్..**

కాకినాడకు డేంజర్ సిగ్నల్ జారీ చేసింది వాతావరణ శాఖ. తీరం దాటే సమయంలో గంటకు 90 ననుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు విరుచుకుపడే అవకాశం ఉంది. కాకినాడ జిల్లాలోని 12 మండలాల్లో హై అలర్ట్? ప్రకటించారు. 24 గంటల్లో ఏపీలోని 8 జిల్లాలకు ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. కాకినాడ సముద్ర తీరంలో రాకాసి అలలు ఎగసిపడుతున్నాయి. సముద్రానికి ఆనుకని ఉన్న గ్రామాల ప్రజలను పునరవాస కేంద్రాలకు తరలిస్తున్నారు అధికారులు. సహాయక చర్యలకోసం కాకినాడ, పిఠాపురం, తాళ్లరేవులో హెలీ పాడ్లు ఏర్పాటు చేశారు.

**ఒడిశా హై అలర్ట్:**

మొంథా తుఫాను ప్రభావం ఆంధ్రప్రదేశ్?తో పాటు ఒడిషాపైన పడింది. ముఖ్యంగా ఒడిశాలోని ఎనిమిది దక్షిణ జిల్లాలు మల్కన్‌గిరి, కోరాపుట్, నబరంగ్‌పూర్, రాయగడ, గజపతి, గంజాం, కలహండి, కంధమల్?పై తీవ్ర ప్రభావం చూపించనుంది. తుఫాన్ నేపథ్యంలో ఒడిషా ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ మేరకు తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో సహకయ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా1,496 మంది గర్భిణీ స్త్రీలు సహా దాదాపు 3,000 మందిని తరలించారు. 1445 తుఫాను ఆశ్రయాలను తెరిచారు. 140 రెస్క్యూ బృందాలను మోహరించింది. తుఫాను ప్రభావానికి గురయ్యే తొమ్మిది జిల్లాల్లోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీలకు అక్టోబర్ 30 వరకు సెలవులు ప్రకటించారు.

**తమిళనాడులో భారీ వర్షాలు:**

మొంతా తుఫాను ప్రభావంతో చెన్నై, తిరువళ్లూరు, రాణిపేట, కాంచీపురంతో సహా ఉత్తర తమిళనాడులో మంగళవారం (అక్టోబర్ 28) భారీ నుండి అతి భారీ వర్షాలు కురిశాయి. తుఫాను ఏపీ తీరం దాటిన కూడా ఈ ప్రాంతంలో వర్షాలు కొనసాగుతాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం (%=వీజ%) తెలిపింది. తుఫాను ఎఫెక్ట్?తో తిరువళ్లూరు, చెన్నై జిల్లా కలెక్టర్లు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. తుఫానును ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సంసిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ పేర్కొన్నారు.

కుండపోత వర్షాలు.. రెడ్ అలర్ట్ జిల్లాలు :

ఆంధ్రప్రదేశ్ : కాకినాడ, కోనసీమ, అనకాపల్లి, ఏలూరు, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లా, వెస్ట్ గోదావరి, ఈస్ట్ గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు

**తెలంగాణ :** ఖమ్మం, కొత్తగూడెం, ములుగు, సూర్యాపేట,

**ఈదురు గాలులు :**

తీవ్ర తుఫాన్ మొంథా తీరం దాటే సమయంలో 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది. గాలుల తీవ్రతకు చెట్లు కూలిపోవచ్చు. కరెంట్ వైర్లు కట్ అవుతాయి. కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతింటుంది.

**రవాణాకు బ్రేక్ :**

తీవ్ర తుఫాన్ మొంథా ప్రభావంతో ఇప్పటికే విశాఖపట్నం, రాజమండ్రి విమానాశ్రయాలు మూసివేత. అన్ని విమాన సర్వీసులు రద్దు చేసిన విమానయాన శాఖ. హైదరాబాద్ శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన అన్ని విమాన సర్వీసులు రద్దు.

**రైళ్లు రాకపోకలు బంద్ :**

విశాఖపట్నం, కాకినాడ నుంచి రాకపోకలు సాగించి 45 రైళ్ల రాకపోకలను రద్దు చేశారు అధికారులు. మరికొన్ని రైలు సర్వీసులను దారి మళ్లించారు.

**బస్సు సర్వీసులు :**

తీవ్ర తుఫాన్ తీరం దాటే కాకినాడ, మచిలీపట్నం, కళింగపట్నం ప్రాంతాల నుంచి వివిధ ప్రాంతాలకు తిరిగే అన్ని బస్సు సర్వీసులను రద్దు చేశారు అధికారులు. ఆయా ప్రాంతాలకు తాత్కాలికంగా బస్సు సర్వీసులు నిలిపివేశారు.

**రెస్క్యూ ఆపరేషన్ :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన విపత్తు నివారణ సర్వీసులకు చెందిన 500 బృందాలు ఫీల్డ్ లోకి దిగాయి. తుఫాన్ ముందు.. తర్వాత సహాయ చర్యలు చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

**జనం తరలింపు :**

తీవ్ర తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని 50 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది ఏపీ ప్రభుత్వం. తుఫాన్ కేంద్రాలు, ప్రభుత్వ స్కూల్స్, కాలేజీల్లో రిలీఫ్ క్యాంప్స్ ఏర్పాటు చేసింది ఏపీ ప్రభుత్వం. మూడు రోజులు అక్కడే అన్నీ సౌకర్యాలు కల్పించే విధంగా ఏర్పాట్లు చేసింది.

# తుపాను బాధితులకు సాయం చేయండి

- మొదటి పేజి తరువాయి

శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని షర్మిల సూచించారు. "ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించే విషయంలో మన నాయకులు ముందుండాలి. ప్రాణనష్టం జరగకుండా చూడటం మనందరి బాధ్యత" అని ఆమె పేర్కొన్నారు. ఆపద సమయంలో ప్రజలకు అండగా నిలవడమే మన కర్తవ్యమని తెలిపారు. మరోవైపు, మొంథా తుఫాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించిపోయింది. రహదారులు చెరువులను తలపిస్తుండగా, అనేక లోతట్టు ప్రాంతాలు, కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో అధికార యంత్రాంగం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ప్రభావిత ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# ప్రజా వ్యతిరేక పాలకులు ఈసారి ఇంటికే

నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్.. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కావేరి డెల్టా ప్రాంతంలో ధాన్యం కొనుగోళ్లు, వరద నష్టాల విషయంలో ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ సర్కార్ పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. రైతుల జీవితాల పట్ల ఉదాసీనత చూపుతూ వారిని మోసం చేస్తోందని మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తీవ్రంగా ధ్వజమెత్తారు.

డెల్టా ప్రాంతాన్ని ముంచెత్తుతున్న ఎడతెరిపిలేని వర్షాలు వరి పంటలను నాశనం చేయడమే కాకుండా, డీఎంకే ప్రభుత్వ అసమర్థతను, నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేశాయని విజయ్ అన్నారు. "నీటికి నాని మొలకెత్తిన ధాన్యం గింజల్లాగే, డీఎంకే ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజల్లో నిరసన కూడా మొలకెత్తి, పెరిగి, ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తుంది" అని ఆయన హెచ్చరించారు. కురుస్తున్న వర్షాల నుంచి మిగిలిన ధాన్యం నిల్వలను కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు తక్షణ చర్యలు తీసుకోలేకపోయిందని విజయ్ ప్రశ్నించారు. "రైతులపై నిజంగా శ్రద్ధ ఉన్న ప్రభుత్వం వారి జీవనోపాధిని కాపాడటానికి, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి సహాయపడుతుంది. కానీ ఈ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తూ, రైతులు కష్టపడి పండించిన పంట వర్షానికి కుళ్లిపోయేలా చేసి పేద రైతులను అణిచివేస్తోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న పేద రైతులకు సకాలంలో కొనుగోళ్లు, గిట్టుబాటు ధర లభించే వ్యవస్థ ఉండాలని విజయ్ నొక్కి చెప్పారు. "ప్రతి ఏటా ఇదే దయనీయ పరిస్థితి పునరావృతమవుతోంది. రైతులు తమ పంటను అమ్ముకొని సంపాదించుకోకుండా స్టాలిన్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటుందా?" అని ఆయన నిలదీశారు. డెల్టా ప్రాంత ప్రయోజనాలకు తామే కాపలాదారులమని డీఎంకే చెప్పుకోవడాన్ని విజయ్ ఎద్దేవా చేశారు. "స్టాలిన్ తాను డెల్టా బిడ్డనని గొప్పలు చెప్పుకుంటారు, కానీ ఏటా రైతుల పంటలు వర్షాలకు నాశనమవుతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటోంది. ఇలాంటి నష్టాలను నివారించడానికి ముందస్తు చర్యలు ఉండక్కర్లేదా? పండించిన ధాన్యాన్ని కాపాడటానికి నిల్వ సౌకర్యాలు మెరుగుపరచవద్దా?" అని ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు. నిల్వ ఉంచిన బస్తాల్లోనే ధాన్యం మొలకెత్తినట్లే, డీఎంకేపై ప్రజా వ్యతిరేకత కూడా ప్రజల మనసుల్లో మొలకెత్తడం ప్రారంభమైందని, ఈ అసంతృప్తి త్వరలోనే బలపడి ప్రజా వ్యతిరేక పాలకులను ఇంటికి పంపిస్తుందని విజయ్ అన్నారు. రైతు వ్యతిరేక కార్యకలాపాలను తక్షణమే నిలిపివేసి, ఈశాన్య రుతుపవనాల నేపథ్యంలో పంటలను, ప్రజలను కాపాడటానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇది శుభవార్త. లక్షలాది మంది ఎదురుచూస్తున్న 8వ కేంద్ర వేతన సంఘం (8%ష్ట్ర జవత్‌త్ఖుశ్రీ ్రాఖఎ జశీఎఎఱంంఱశీఅ%) ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం సమావేశమైన కేంద్ర కేబినెట్.. 8వ వేతన సంఘం ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలకు (%వతీఎం శీట =వటవతీవఅఎవ%) ఆమోదముద్ర వేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షనర్ల చెల్లింపుల పెంపుపై ఈ కమిషన్ త్వరలో తన పనిని ప్రారంభించనుంది. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల మందికి పైగా పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. వేతన సంఘం ఒక తాత్కాలిక వ్యవస్థలా పనిచేస్తుంది. ఇందులో ఒక ఛైర్‌పర్సన్, ఒక పార్ట్‌టైమ్ సభ్యుడు, ఒక మెంబర్-సెక్రటరీ ఉంటారు. ఈ కమిషన్ తన నియామకం జరిగిన తేదీ నుంచి 18 నెలల్లోగా ప్రభుత్వానికి తన సిఫార్సులను సమర్పించాల్సి ఉంటుంది. అవసరమైతే, తుది సిఫార్సులకు ముందే మధ్యంతర నివేదికలు కూడా ఇచ్చే వెసులుబాటును కల్పించారు. సిఫార్సులు చేసేటప్పుడు కమిషన్ పలు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కేబినెట్ నిర్దేశించింది. దేశ ఆర్థిక పరిస్థితి, ఆర్థిక క్రమశిక్షణ ఆవశ్యకత, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల లభ్యత వంటి అంశాలను పరిశీలించనుంది. అలాగే, ఈ సిఫార్సుల ప్రభావం రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉంటుందో కూడా అంచనా వేయనుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు , ప్రైవేట్ రంగంలోని ఉద్యోగుల జీతభత్యాలు, పని పరిస్థితులను కూడా దృష్టిలో ఉంచుకుని నివేదిక రూపొందించాల్సి ఉంటుంది. సాధారణంగా ప్రతి పదేళ్లకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తుంది. ఉద్యోగుల జీతభత్యాలు, పదవీ విరమణ ప్రయోజనాలు, ఇతర సేవా నిబంధనలను సమీక్షించి, వాటిలో మార్పులను సూచించడం ఈ కమిషన్ ప్రధాన విధి. ఈ క్రమంలో, 8వ వేతన సంఘం సిఫార్సులు 2026 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. 7వ వేతన సంఘాన్ని 2014 ఫిబ్రవరిలో ఏర్పాటు చేయగా, దాని సిఫార్సులను ప్రభుత్వం 2016 జనవరి నుంచి అమలు చేసిన విషయం తెలిసిందే. 8వ వేతన సంఘం ఏర్పాటుపై ప్రభుత్వం 2025 జనవరిలో ప్రకటన చేసింది. తాజాగా కేబినెట్ ఆమోదంతో ఈ ప్రక్రియ అధికారికంగా ముందుకు సాగనుంది.

# తీవ్ర తుఫాను హెచ్చరికతో ఎస్పీ రాహుల్ మీనా పర్యవేక్షణలో కోనసీమలో పటిష్ట ఏర్పాట్లు

**అమలాపురం రూరల్, పెన్ పవర్,అక్టోబర్ 28:** బంగాళాఖాతం లో ఏర్పడి తీవ్ర తుఫానుగా మారిన వాయుగుండం డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తీరం దాటే అవకాశం ఉన్న నేపథ్యంలో, ప్రాణ మరియు ఆస్తి నష్టం జరగకుండా పోలీసు యంత్రాంగం ఇతర శాఖలతో కలిసి యుద్ధ ప్రాతిపదికన ముందస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ తెలిపారు.ముమ్మిడివరం, రాజోలు, సక్కినేటిపల్లి, అల్లవరం, కాట్రేనికోన, ఐ. పోలవరం, అమలాపురం, ఉప్పలగుప్తం ప్రాంతాల్లో తుఫాను తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉండటంతో, ప్రమాదాన్ని ముందుగానే అంచనా వేసి చర్యలు చేపట్టినట్టు వివరించారు. జిల్లాలో మొత్తం 149 సచివాలయాల పరిధిలో షెల్టర్ జోన్లు ఏర్పాటు చేసి, ప్రతి కేంద్రంలో కమ్యూనికేషన్ కోసం ఒక జీఎంఎస్‌కే సిబ్బంది, ఒక పోలీసు సిబ్బందిని నియమించారు. 9 చోట్ల రిపీటర్లు, 5 కంట్రోల్ రూములు ఏర్పాటు చేయడం జరిగింది.నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే కాలువలు, వాగులు, కల్వర్టులు, లోతట్టు ప్రాంతాల్లో పోలీసులతో కలిసి ప్రత్యేక గస్తీ అమలు చేస్తున్నారు. పాత భవనాలు, రేకుల షెడ్లలో ఉన్న ప్రజలను రెవెన్యూ శాఖతో సమన్వయం చేసి సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించారు.ప్రచార హోర్డింగ్‌లు ఈదురు గాలులకు పడిపోతూ ప్రమాదం కలిగించే అవకాశముండటంతో, ప్రమాదకర హోర్డింగ్‌లను తొలగిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు.సహాయక చర్యల కోసం ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాలు, ప్రతి నియోజకవర్గానికి డీఎస్పీ స్థాయి అధికారులు, ప్రతి మండలానికి సీఐ స్థాయి అధికారులు పర్యవేక్షణలో ఉన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా తుపాను ప్రభావిత ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు.ప్రజలు తప్పనిసరిగా పాటించాల్సిన జాగ్రత్తలు

అత్యవసర పరిస్థితులు లేకుండా బయటకు రావద్దు
విద్యుత్ లైన్లు, తెగిన తీగలకు దూరంగా ఉండాలి
వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లరాదు
వాహనాలు నీటిలో నడపడం ప్రమాదకరం
పునరావాస సూచనలు వెంటనే పాటించాలి.ఎటువంటి అత్యవసర పరిస్థితి వచ్చినా వెంటనే డయల్ 112 ద్వారా సమాచారమివ్వాలని ఎస్పీ రాహుల్ మీనా విజ్ఞప్తి చేశారు.



పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# ఏజెన్సీలో వాగులను పరిశీలించిన డిఎస్పి

**జీలుగుమిల్లి, పెన్ పవర్, అక్టోబర్ 28 :** తుఫాను ప్రభావంతో ఉన్న ఏజెన్సీలో వాగులు ,కల్వర్టులను ప్రజలు దాటవద్దని పోలవరం డిఎస్పి ఎం వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం జీలుగుమిల్లిలో అశ్వరావుపేట వాగు, వంక వారి గూడెం వాగులను పరిశీలించారు. ప్రమాదకరమైన వాగుల వద్ద పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. తుఫాను కారణంగా రహదారిపై వర్షపనీరు ప్రవహించి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కనుక జాగ్రత్తగా చూసుకొని వెళ్లాలని అన్నారు. ఆయనతోపాటు జీలుగుమిల్లి సిఐ బి వెంకటేశ్వరరావు, ఎస్సై వి క్రాంతి కుమార్, సిబ్బంది ఉన్నారు.



# మొంథా తుఫాన్‌పై అధికారులతో మంత్రి కందుల దుర్గేష్ సమీక్షా సమావేశం






## రానున్న మూడు రోజుల పాటు అధికారులు విధుల్లో ఉండాలి

**రాజమహేంద్రవరం,పెన్ పవర్,అక్టోబర్ 28:**మొంథా తుఫాన్ ముంచుకొస్తున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం, ప్రజలు అప్రమత్తతతో ఉండాలని మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా తూర్పు గోదావరి జిల్లా అధికారులతో మంగళ వారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా మంత్రి దుర్గేష్ తో పాటు జిల్లా ప్రత్యేక అధికారి కె. కన్నబాబు, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి. నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, మునిసిపల్ కమిషనర్ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, రహదారులపై గండ్లు పడటం, చెట్లు కూలడం, ముంపు ప్రాంతాలు వంటి సమస్యలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక యువత, ఎస్డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలతో సమన్వయంగా పనిచేయాలన్నారు. విపత్తు నిర్వహణలో యువతతో బృందాలను సిద్ధం చేసుకోవాలని, పశుసంపదను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. జిల్లా ప్రత్యేక అధికారి కె. కన్నబాబు మాట్లాడుతూ, ఎర్ర కాలువ, కొవ్వాడ కాలువ, బురద కాలువలలో నీటి ప్రవాహ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా అన్ని విభాగాలతో విపత్తు నిర్వహణ యంత్రాంగం అందుబాటులో ఉనట్లు తెలిపారు. అవసరమైతే డ్రోన్ ల ద్వారా మందులు, ఆహార సరఫరా చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, తుఫాన్ పై వాతావరణ శాఖ సూచనలను అనుసరించాలని, ఎస్ ఓ పి ప్రకారం శాఖలు చర్యలు అమలు చేయాల న్నారు. పునరావాస కేంద్రాలకు మహిళలు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగుల తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అవసరమైన ఆహారం, త్రాగునీరు, రేషన్, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచామన్నారు. పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎస్పీ డి. నరసింహ కిషోర్ మాట్లాడుతూ, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు పహారా విధులు కట్టుదిట్టం చేశారని, ఎస్డిఆర్ఎఫ్, ఫైర్, పోలీస్ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లరాదని, కంట్రోల్ రూమ్ లు 24 గంటలు పనిచేస్తున్నాయన్నారు.

ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ, "కొత్త చెరువు వద్ద 1000 ఇసుక బస్తాలతో రక్షణ ఏర్పాట్లు చేశామని , పంట కోతకు ముంపు ప్రాంతాల్లో నీటి నిలువ లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్ మాట్లాడుతూ, పునరావాస కేంద్రాల్లో, మైనర్ ఇరిగేషన్ ప్రాంతాల్లో అధికారులు జాగ్రత్తలు తీసుకుంటు

రన్నారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి టి సీతారామమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె భాస్కర్ రెడ్డి, ఇతర అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా ఉన్నత స్థాయి అధికారులు, ఎన్ డి ఆర్ ఎఫ్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

# పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 28:**రాజమహేంద్రవరం రూరల్ మండలం నామవరం డి-బ్లాక్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ కీర్తి చేకూరి మంగళవారం తనిఖీ చేశారు. వర్షాలు, తుపాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలను సురక్షిత ప్రదేశాలకు తరలించి, ఏర్పాటు చేసిన వసతులను ఆమె పరిశీలించారు. కేంద్రంలో తాగునీరు, ఆహారం, విద్యుత్, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కలెక్టర్ కీర్తి చేకూరి పునరావాస కేంద్రంలో నివసి స్తున్న కుటుంబాలతో ముఖాముఖి మాట్లాడి వారి అవసరాలను తెలుసుకున్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు సౌకర్యంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

ఆమె వెంట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే. భాస్కర్ రెడ్డి, మండల స్పెషల్ అధికారి కే. ఎన్. జ్యోతి, ఎంపీడీవో, ఆరోగ్య , సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రజల భద్రతకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, అదనపు పునరావాస కేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తానన్నారు. ప్రతి అధికారి తన పరిధిలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

# తుఫాన్ ప్రభావం నేపథ్యంలో పునరావాస కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 28:** మండలంలోని అంబాజీపేట హై స్కూలు, గంగలకురు హైస్కూలు, జి అగ్రహారం మరియు పుల్లేటికురు, కె. పెదపూడి ప్రాంతాలలో మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ మంగళవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తుఫాన్ కారణంగా ప్రజలకు సంభవించగల నష్టాల గురించి వివరించి, ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో రెండు రోజులు తప్పనిసరిగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# కోలంక-గొల్లపాలెం, ఆర్యవటంలో కూలిన భారీ చెట్లు





## సహాయక చర్యల్లో నేరుగా పాల్గొన్న మంత్రి సుభాష్

**కాజులూరు, పెన్ పవర్,అక్టోబర్ 28:** మొంథా తుఫాను ప్రభావంతో కాజులూరు మండలంలోని కోలంక, గొల్లపాలెం గ్రామాల్లో బలమైన ఈదురుగాలులకు భారీ వృక్షాలు నేలకూలాయి. చెట్లు కూలిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సమయంలో కోలంక రోడ్డు మార్గంలో ప్రయాణిస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఘటనను గమనించి తక్షణమే అప్రమత్తమయ్యారు. వెంటనే సంబంధిత అధికారులను సంఘటన స్థలానికి పిలిపించి, స్వయంగా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. మంత్రియేతర విభాగాల యంత్రాంగం సమన్వయంతో అతి తక్కువ సమయంలోనే చెట్టును యంత్రాల సహాయంతో తొలగించారు.అలాగే గొల్లపాలెం ప్రాంతంలో కూడా వృక్షాలు కూలడంతో ప్రమాద పరిస్థితి ఏర్పడటం పై మంత్రి సుభాష్ స్పందించారు. పోలీసు, రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేసి, అక్కడ పర్యవేక్షణను చేపట్టారు. మంత్రి నేరుగా చర్యలు తీసుకోవడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.తర్వాత మంత్రి మండలంలోని పలు పునరావాస కేంద్రాలను సందర్శించి అక్కడి ప్రజలకు ధైర్యం చెప్పారు. తుఫాను ప్రభావాన్ని ఎదుర్కోవడానికి కూటమి ప్రభుత్వం పూర్తిగా సన్నద్ధంగా ఉందని ప్రజలకు భరోసా ఇచ్చారు.

# ప్రజల భద్రతే లక్ష్యం - తుఫానుపై అప్రమత్తంగా ఉన్న ప్రభుత్వం : ఎమ్మెల్యే బండారు








**కొత్తపేట,పెన్ పవర్,అక్టోబర్ 28:**మొంథా తుఫాను తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం అన్ని విభాగాలను పూర్తిగా అప్రమత్తం చేసిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. మంగళవారం ఆయన రావులపాలెం మండలం రావులపాడు, కొత్తపేట మండలం వానపల్లి శివారు సంఘంపాలెం పునరావాస కేంద్రాలను ఆర్డీవో శ్రీకర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో తుఫాను ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనే చర్యలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే గుడిసెలు, రేకు షెడ్లు, శిథిల ఇళ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. నియోజకవర్గంలో మొత్తం 111 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, అందులో రావులపాలెం మండలంలో 42, ఆత్రేయపురం మండలంలో 21, ఆలమూరు మండలంలో 22, కొత్తపేట మండలంలో 26 కేంద్రాలు ఉన్నాయని వివరించారు. ఇతర జిల్లాల ప్రజలు కూడా ఈ కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నారని చెప్పారు. రావులపాడు కేంద్రంలో నంద్యాల జిల్లా నుంచి వచ్చిన 90 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయార్థులకు స్వయంగా భోజనం వడ్డించిన ఎమ్మెల్యే, ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నపిల్లలు, గర్భిణీలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతులు పశువులను సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. తుఫాను తీరం దాటే సమయం దగ్గరపడుతున్నందున అధికార యంత్రాంగం రాత్రింబవళ్లు పనిచేస్తోందని తెలిపారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం, పశునష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎవరికైనా సహాయం అవసరమైతే 98492 43777, 80082 43777 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, కంఠంశెట్టి శ్రీనివాస్, పల్లి భీమరావు, కొప్పిశెట్టి ప్రసాద్, గనిశెట్టి వీరేష్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ రూమ్ ను సందర్శించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 28**

మొంథా తుఫాన్ పరంగా విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు నగరపాలకసంస్థ అధికారులు సిద్ధంగా ఉన్నారని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన ఎమ్మెల్యే అక్కడ అధికారులతో సమీక్ష నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి మాట్లాడుతూ, కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నగరంలో ఉన్న 142 కెమేరాలతో పరిస్థితిని అధికారులతో కలిసి పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఆర్ఎంసి హెల్ప్‌లైన్ కూడా 24/7 అందుబాటులో ఉందన్నారు. ఏడు ఫిర్యాదులు రాగా మూడు పరిష్క రించారని, మరో 4 పరిశీలన లో ఉన్నాయన్నారు. చెట్లు పడిపోవడం, నీరు నిలిచిపోవడం వంటి సమస్యల పై ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్ విభాగాలతో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటయ్యాయని ఫిర్యాదు వచ్చిన వెంటనే పరిష్కరిస్తారన్నారు. నీట మునిగే ప్రాంతాల్లో గత రెండ్రోజులుగా డిసిల్టింగ్ చేపట్టామన్నారు. నల్లా చానల్ వద్ద అదనపు మోటార్లు ఏర్పాటు, కోటిలింగాల పేట వద్ద కోటిరన్న సిఎస్ఆర్ నిధులతో పంప్‌హౌస్ ఏర్పాటు చేయడం వల్ల అరగంటలోనే క్లియర్ అవుతోందన్నారు. తుఫాన్ తీరం దాటే వరకు అధికారులతో పాటు కూటమి నాయకులు, తాను సిద్ధంగా ఉంటామన్నారు. ప్రజలు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో వీచే తీవ్రమైన గాలుల వల్ల రేకులు ఎగిరిపడటం, చెట్లు, విద్యుత్ తీగలు తెగిపడటం జరుగుతుందని, అందువల్ల బయటికి రావద్దని ప్రజలకు సూచిం చారు. అంబేద్కర్ కమ్యూనిటీ హాల్, రజక కమ్యూనిటీ హాల్, పందిరి మహాదేవుడు సత్రాల్లో ఎంసిఆర్ ఆధ్వర్యంలో పునరావాస కేంద్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 150 ళ్ళు శిధిల స్థితిలో ఉన్నయని, వారు కూడా పునరావాస కేంద్రాలకు వస్తే సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు యాళ్ల ప్రదీప్, తంగెళ్ల బాబీ, కరగాని వేణు, కేలం శ్రీనివాస్, ఆర్ఎంసి అదనపు కమీషనర్ పివి రామలింగేశ్వర్ ఇతర అధికారులు ఉన్నారు.

# జగ్గంపేట విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

**విద్యుత్ సరఫరా నిలిచినా పట్టించుకోని విద్యుత్ యంత్రాంగం**

**పనిచేయని విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్ నెంబర్లు**

**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబరు 28:** జగ్గంపేట విద్యుత్ శాఖాధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో కనీసం విద్యుత్ శాఖాధికారులు ఎక్కడా ముందస్తు చర్యలు చేపట్టలేదు. దీంతో జగ్గంపేట మండలంలో మూడు గ్రామాలకు మంగళవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తుఫాను పూర్తిస్థాయిలో ప్రభావం చూపకపోయినప్పటికీ విద్యుత్ అంతరాయం ఏర్పడినా జగ్గంపేట విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోలేదు. జగ్గంపేట మండలంలోని ఇర్రిపాక, మామిడాడ, మర్రిపాక గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సొంత గ్రామంలోనే విద్యుత్ అంతరాయం ఏర్పడితే నియోజకవర్గంలో పరిస్థితి ఎలా ఉందోనని పలు విమర్శలు వెల్లువెత్తాయి. తుఫాన్ నేపథ్యంలో కంట్రోల్ రూమ్ లు ప్రకటించిన విద్యుత్ శాఖాధికారుల నెంబర్లకు ఫోన్ చేస్తే ఆ నెంబర్లు పనిచేయడంలేదు. పని చేయని నెంబర్లు కంట్రోల్ రూమ్లకు ఇవ్వడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పలువురు స్థానికులు జగ్గంపేట ఎలక్ట్రికల్ డీఈతో మాట్లాడగా అయ్యో మీ గ్రామంలో కరెంటు లేదా అంటూ సమాధానం చెప్పడంతో స్థానిక ప్రజలు అవాక్కయ్యారు. అసలు ఈ మూడు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఎందుకు నిలిచిపోయిందో డీఈ, ఏఈ ఇతర విద్యుత్ సిబ్బందికి కూడా తెలియకపోవడం విడ్డూరంగా ఉంది. దీన్ని బట్టి విద్యుత్ శాఖాధికారులు ఏవిధమైన ఉద్యోగం చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చని పలువురు విమర్శించారు. విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# తుఫాను సమయంలో ఉద్యానరైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి -ఉద్యాన అధికారిణి పి. రిని





**గోకవరం, పెన్ పవర్, అక్టోబరు 28 :** మొంథా తుఫాను కారణంగా బలమైన ఈదురుగాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ కారణంగా ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని నష్ట నివారణకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన అధికారిణి పి రిని తెలిపారు. మంగళవారం గ్రామస్థాయి ,మండల స్థాయి ఉద్యాన సిబ్బందితో కలిసి రంపఎర్రంపాలెం, తిరుమలాయపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఉద్యానపంటల్లో నష్ట నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఆయిల్ పామ్ తోటల్లో నీరు నిలువ ఉండకుండా బయటికి పోయే మార్గం ఏర్పాటు చేసుకోవాలని తేమ ఉన్నప్పుడే ప్రతి మొక్కకు రెండున్నర కిలోల యూరియా 3.7 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్ రెండు కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 500 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ 100 గ్రాములు బోరాన్ రెండు దఫాలుగా అందజేయాలని, అదేవిధంగా లేత తోటల్లో మురుగునీరు లేకుండా చూసుకోవాలని ఎక్కువ రోజులు మొక్క మొదట్లో నీరు నిలువ ఉన్నట్లయితే మొవ్వుకుళ్ళు వచ్చే ప్రమాదం ఉందని ఆమె తెలిపారు. మామిడి తోటల్లో విరిగిన కొమ్మలను కత్తిరించి పైభాగాన బోర్డో పేస్ట్ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ ను పూతగా పూయాలని, ప్రతి చెట్టుకు 500 గ్రాములు యూరియా 417 గ్రాములు మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 25 కిలోల పశువుల ఎరువు వేయాలని, వేర్లను తెగుళ్ల నుండి కాపాడేందుకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ లీటరుకు మూడు గ్రాములు చొప్పున మొదళ్ళ వద్ద తడపాలని, చెట్టు త్వరగా కోలుకోవడానికి పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు బొరాక్స్ 1.25 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు వివరించారు. అదేవిధంగా జీడి మామిడి తోటల్లో వంగిపోయిన కొమ్మలను రంపంతో కోసి కొమ్మల చివర బోర్డో మిశ్రమం లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ పూత పూయాలని, కాండం తొలిచే పురుగు ఆశించకుండా ఒక లీటరు నీటికి మోనోక్రోటోపాస్ 1.6 మి.లీ కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలని, చెట్లు వెంటనే తేరుకోవడానికి ఒక శాతం పొటాషియం నైట్రేట్ రెండు శాతం యూరియాను వారు రోజులు వ్యాధిలో రెండు నుండి మూడు సార్లు పిచికారీ చేయాలని రైతులకు ఉద్యానాధికారిణి రిని వివరించారు.

# మోంధ తుఫాన్‌పై అధికారులు అప్రమత్తం...

- ప్రజలు ఇంట్లోనే ఉండాలని ఐటిడీఏ పీఓ సూచన..
- ప్రత్యేక కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్లు సిద్ధం





**దేవీపట్నం,పెన్ పవర్,అక్టోబర్28:**మోంధ తుఫాన్ ప్రభావం దృష్ట్యా అధికారులు పూర్తి స్థాయి అప్రమత్తతతో ఉన్నారని రంపచోడవరం ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి (పీఓ) స్మరణ్ రాజ్ తెలిపారు. మంగళవారం దేవీపట్నం మండలంలో పలుచోట్ల వరద ప్రవహిత ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. మీడియాతో మాట్లాడుతూ,తుఫాన్ ప్రభావం అధికంగా ఉండే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టినట్లు వివరించారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో అధికారులకు అప్రమత్తత సూచనలు జారీ చేశామని,అవసరమైన రక్షణ ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. తుఫాన్ సమయంలో ప్రజలు నిరవసరంగా బయటకు రాకూడదని,గృహాలలోనే ఉండాలని స్మరణ్ రాజ్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని,అవసరమైన వస్తువులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అదేవిధంగా తుఫాన్ సమయంలో ఎవరైనా ఇబ్బందుల్లో ఉన్నా వెంటనే సమాచారమివ్వడానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని,టోల్‌ఫ్రీ నంబర్లు 24 గంటలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విద్యుత్ శాఖ,పంచాయతీ,ఆరోగ్య, అగ్నిమాపక,పోలీసు శాఖలతో సమన్వయంతో పనిచేస్తున్నామని,తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో నిత్యావసర వస్తువుల సరఫరా సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకున్నామని ఆయన వివరించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉందని,ఎవరికీ ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని రంపచోడవరం ఐటిడీఏ పీఓ స్మరణ్ రాజ్ తెలిపారు.

# కొత్తపేట డివిజన్‌లో రవాణా, వాణిజ్య సేవలు నిలిపివేత - అత్యవసర ఆదేశాలు జారీ చేసిన ఆర్డీఓ పి. శ్రీకర్



**కొత్తపేట,పెన్ పవర్ అక్టోబర్ 28:**మొంథా తుఫాను తీవ్రత గంట గంటకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల భద్రత కోసం కొత్తపేట రెవెన్యూ డివిజన్‌లో అత్యవసర ఆంక్షలు అమలులోకి వచ్చాయి. డివిజనల్ రెవెన్యూ అధికారి (ఆర్డీఓ) పి. శ్రీకర్ మంగళవారం మధ్యాహ్నం అత్యవసర ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్నం నుండి అత్యవసర వైద్య దుకాణాలు మినహా అన్ని రకాల వాణిజ్య దుకాణాలు, సముదాయాలు మూసివేయబడ్డాయి. మద్యం దుకాణాలు కూడా మూసివేయబడ్డాయి.

అలాగే ప్రజల రక్షణ కోసం అన్ని ఆర్టీసీ బస్సు సర్వీసులు పూర్తిగా రద్దు చేయబడ్డాయని చెప్పారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ప్రైవేట్ వాహనాలు సహా అన్ని రకాల రవాణా సేవలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు.

తుఫాను బలమైన ఈదురుగాలులతో కొనసాగుతున్నందున ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలే ప్రమాదం ఉన్నందున రోడ్లపైకి రావడం ప్రమాదకరమని హెచ్చరించారు.

పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలు వచ్చే 24 గంటల పాటు అక్కడే ఉండాలని, తిరిగి ఇళ్లకు వెళ్లవద్దని సూచించారు. రోడ్లపై అడ్డుగా పడిన చెట్లు, విద్యుత్ తీగలు, మురికివాటిని తొలగించేందుకు ఆర్అండ్‌బి, ఫైర్, పంచాయతీ శాఖల అత్యవసర సిబ్బంది మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు.

# మొంతా తుఫాను ప్రభావం అంతంత మాత్రమే



**వై రామవరం, పెన్ పవర్,అక్టోబర్ 28 :** మండలంలో మొంతా తుఫాను ప్రభావం అంతంత మాత్రంగానే ఉందని స్థానికులు అంటున్నారు.

తుఫాను ప్రభావం అధికంగా ఉంటుందని ఏ ఎస్ ఆర్ జిల్లాలో 28, 29 తేదీలలో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఆకాశం మేఘావృతం కావడం, ఈదురు గాలులతో కూడిన ఒక మోస్తరుగా వర్షం అప్పుడప్పుడు కురుస్తూనే ఉందని అంటున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలనే ప్రకటనలతో ప్రజలు ఇండ్లకే పరిమితం అయ్యారని తెలిపారు. వర్షం అధికంగా లేకపోవడంతో చిన్న పెద్ద కాలువలు యధావిధిగా ప్రవహిస్తున్నాయని తెలిపారు. ఈదురు గాలుల కారణంగా విద్యుత్ సరఫరా లో కాస్త అంతరాయం ఏర్పడిందని అంటున్నారు.

## పునరావాస కేంద్రాలను పరిశీలించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆరోగ్య విభాగం ప్రధాన కార్యదర్శి డా"రవి రామ్ గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 28**
మొంథా తుఫాన్ ముంచుకొస్తున్న తరుణంలో రాజమహేంద్రవరం రూరల్ మండలం,స్తానిక హుకుంపేట గ్రామం డి బ్లాక్ లో ఏర్పాటు చేసిన పునరావాసా లను డా"రవి రామ్ కిరణ్ గోరంట్ల అధికారులతో కలిసి పరిశీలించారు.
ఆ సందర్భంగా డా"రవి రామ్ కిరణ్ మాట్లాడుతూ, ప్రజలు, ప్రభుత్వంతో కలిసి విపత్తును ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలని, ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకి అందుబాటులో ఉందనన్నారు. పునరావస కేంద్రాలలో వసతులు బాగున్నాయని, అధికారులు అన్ని రకాల వసతులను ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం భోజన వసతి ఏర్పాటులను పరిశీలించి బాధితులకు వడ్డించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో రాజమండ్రి రూరల్ టీడీపీ మండల అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, గ్రామ కమిటీ అధ్యకులు దుద్దుపూడి రమేష్, కో క్లస్టర్ బొప్పన నానాజీ, గారపాటి నాగేశ్వరరావు, కొల్లి దుర్గాప్రసాద్, వీరసింగ్, తిరుపతి రాము, ఇమ్మంది శివరామ్, ఇళ్ళా రాము, సేంద్రీ నాని. ప్రత్యేక అధికారి జ్యోతి,ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, ఎమ్మార్వో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కాశినాథ్, పలువురు పాల్గొనారు.

## పునరావాస కేంద్రాలను పరిశీలించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆరోగ్య విభాగం ప్రధాన కార్యదర్శి డా"రవి రామ్ గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 28:**మొంథా తుఫాన్ ముంచుకొస్తున్న తరుణంలో రాజమహేంద్రవరం రూరల్ మండలం,స్తానిక హుకుంపేట గ్రామం డి బ్లాక్ లో ఏర్పాటు చేసిన పునరావాసా లను డా"రవి రామ్ కిరణ్ గోరంట్ల అధికారులతో కలిసి పరిశీలించారు.
ఆ సందర్భంగా డా"రవి రామ్ కిరణ్ మాట్లాడుతూ, ప్రజలు, ప్రభుత్వంతో కలిసి విపత్తును ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలని, ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకి అందుబాటులో ఉందనన్నారు. పునరావస కేంద్రాలలో వసతులు బాగున్నాయని, అధికారులు అన్ని రకాల వసతులను ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం భోజన వసతి ఏర్పాటులను పరిశీలించి బాధితులకు వడ్డించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో రాజమండ్రి రూరల్ టీడీపీ మండల అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, గ్రామ కమిటీ అధ్యకులు దుద్దుపూడి రమేష్, కో క్లస్టర్ బొప్పన నానాజీ, గారపాటి నాగేశ్వరరావు, కొల్లి దుర్గాప్రసాద్, వీరసింగ్, తిరుపతి రాము, ఇమ్మంది శివరామ్, ఇళ్ళా రాము, సేంద్రీ నాని. ప్రత్యేక అధికారి జ్యోతి,ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, ఎమ్మార్వో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కాశినాథ్, పలువురు పాల్గొనారు.

## తుఫాన్ భయాలు వద్దు: మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు కూటమి ప్రభుత్వం భరోసా!

* ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్ ఆదేశాలపై అప్రమత్తత!



**కరప, పెన్ పవర్, అక్టోబర్ 28:** పెను తుఫాన్ 'మొంథా' తీరం వెంబడి మరింత ఉధృతమవుతున్న నేపథ్యంలో, కరప ప్రాంత ప్రజలకు టీడీపీ నేతలు భరోసా ఇచ్చారు. "ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మీకు అండగా నిలుస్తుంది," అంటూ ప్రజల్లో విశ్వాసం నింపారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నుండి అందిన ఆదేశాల మేరకు, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర శెట్టిబలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం ఉప్పలంక గ్రామంలోని ప్రత్యేక పునరావాస కేంద్రాన్ని స్వయంగా పరిశీలించారు. ఉప్పలంక తుఫాన్ షెల్టర్ వద్ద ఉన్న పునరావాస కేంద్రంలో ఏర్పాట్లపై నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు. కరప మండల తహశీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్ నుండి వారు వివరాలు సేకరించారు. ప్రస్తుతం తుఫాన్ తీవ్రత దృష్ట్యా సుమారు వంద మంది ప్రజలు ఈ కేంద్రంలో సురక్షితంగా ఆశ్రయం పొందుతున్నట్లు తహశీల్దార్ వెల్లడించారు. ?ఈ కార్యక్రమంలో కరప టీడీపీ సీనియర్ నాయకులు దేవు వెంకటేశ్వరరావు (వెంకన్న), సంగాని బాలసుబ్రమణ్యం (మహేష్), గేదెల సత్తిబాబు, బోమ్మడి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ పై అధికారులు అప్రమత్తం



పెద్దాపురంలో నేలకొరిగిన వృక్షాలు... విరిగిన విద్యుత్ స్తంభాలు

ఏలేరు వరద ఉధృతిని పరిశీలించిన ఆర్డీవో శ్రీరమణి



**పెద్దాపురం, పెన్ పవర్, అక్టోబరు 28 :** మొంథా తుఫాన్ ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలను చేపట్టారు. ఎక్కడిక్కడ క్రిందస్థాయి అధికారులు, సిబ్బందిని ఉన్నతాధికారులు అప్రమత్తం చేశారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని పెద్దాపురం ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యంగా తుఫాన్ ప్రభావానికి గురయ్యే ఏలేరు పరివాహక గ్రామాలైన కట్టమూరు, కాండ్రకోట, మర్లావ గ్రామాల్లో తహసీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ, ఎస్ఐ వి. మౌనిక మంగళవారం పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో వీచిన ఈదురుగాలులు కారణంగా పట్టణ పరిధిలోని గౌరీకోనేరు ప్రాంతంలో వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. మున్సిపల్ కమీషనర్ కె. శ్రీకాంత్ రెడ్డి అక్కడి పరిస్థితిని పరిశీలించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలను చేపట్టారు. అలాగే పెద్దాపురం నుంచి జగ్గంపేట వెళ్లే ప్రధాన రహదారిలో చెట్లు నేలకొరిగాయి. అలాగే కొమ్మలు విరిగిపడడంతో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది. పాతపెద్దాపురు శివారులో ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహించడంతో అధికారులు పరిశీలించి తగుముందస్తు జాగ్రత్త చర్యలను చేపట్టారు. అలాగే కట్టమూరు, పులిమేరు, కాండ్రకోట, గుడివాడ, సిరివాడ, దివిలి తదితర గ్రామాల్లో వరిపైరు ఈదురుగాలుల కారణంగా నేలవాలింది.





## మొంధ తుఫాన్ ప్రభావం - ఆత్రేయపురంలో ఎంపీడీవో పర్యటన





**ఆత్రేయపురం,పెన్ పవర్ అక్టోబర్ 28**
బంగాళాఖాతంలో ఏర్పడిన మొంద తుఫాన్ ప్రభావం నేపథ్యంలో జాగ్రత్త చర్యలలో భాగంగా ఆత్రేయపురం మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఎంపీడీవో బి.కె.ఎస్.ఎస్. వెంకటరామన్ స్వయంగా సందర్శించారు.
ఆత్రేయపురం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ మెయిన్ స్కూల్, అలాగే పులిదిండి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో తాత్కాలికంగా నివసిస్తున్న ప్రజల స్థితిగతులను ఆయన పరిశీలించారు.ప్రజలకు అందిస్తున్న భోజనం, త్రాగునీరు, వైద్య సదుపాయాలు, విద్యుత్ వసతులు వంటి అంశాలను సమీక్షించిన ఎంపీడీవో, అన్ని అవసరమైన ఏర్పాట్లు తక్షణం చేయాలని అధికారులను ఆదేశించారు.
ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని వెంకటరామన్ తెలిపారు.

## డొక్కా సీతమ్మ కాంటీన్ లో అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 28:** జగంపేట టౌన్ పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరియు జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ కాంటీన్ నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి తుమ్మలపల్లి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ అందరికీ అన్నం పెట్టే డొక్కా సీతమ్మను పవన్ కళ్యాణ్ ఆదర్శంగా తీసుకుంటే ఆయన్ను తుమ్మలపల్లి రమేష్ స్ఫూర్తి గా తీసుకుని తన సొంత ఖర్చులతో ప్రతి మంగళవారం నిర్విరామంగా డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహిస్తున్నారని, సేవా కార్యక్రమాలను చేస్తున్నారని అన్నారు. డొక్కా సీతమ్మ కాంటీన్ ద్వారా సుమారు 500 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గం జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తుఫాను ప్రభావంపై ఎమ్మెల్యే గోరంట్ల పర్యవేక్షణ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 28**
తుఫాను పరిస్థితుల దృష్ట్యా ప్రజలు ఆందోళన చెందవద్దని, అప్రమత్తంగా ఉండాలని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మంగళవారం పిలుపు ఇచ్చారు. ప్రస్తుతం తుఫాను తీరం దాటే సమయంలో గంటకు 100 కిలోమీటర్ల వేగంతో గాలులతో, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రజల భద్రతపై నిరంతర దృష్టి సారించారు. హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తుఫాను ప్రభావం, పునరావాస కేంద్రాల ఏర్పాట్ల గురించి వివరాలు తెలుసుకున్నారు. ప్రజల తరలింపు, సౌకర్యాలు, సహాయక చర్యలపై ఆయన సమీక్ష జరిపారు. ప్రతి పునరావాస కేంద్రంలో తాగునీరు, విద్యుత్, ఆహారం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు పాడైన ఇళ్లలో నివసిస్తున్న వారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సురక్షిత కేంద్రాలకు వెళ్లాలని ఎమ్మెల్యే గోరంట్ల విజ్ఞప్తి చేశారు. తుఫాను సమయంలో అవసరం లేని ప్రయాణాలు చేయకూ డదని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు తుఫాను ప్రభావాన్ని పర్యవేక్షిస్తు న్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల భద్రత కోసం అన్ని విధాల అండగా ఉంటుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు.

## వరి పంటలు పరిశీలించిన వ్యవసాయ అధికారి



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 28:** మొంథా తుఫాను నేపథ్యంలో జగ్గంపేట మండలంలో వరి పొలాలను మంగళవారం జగ్గంపేట మండల వ్యవసాయ అధికారి నరసింహం పరిశీలించారు. జగ్గంపేట, రామవరం, సీతానగరం గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించి ప్రస్తుతానికి పొలాల వద్ద పరిస్థితి బాగానే ఉందన్నారు. మంగళవారం రాత్రికి వర్షాలు మరింత కురిస్తే పరిస్థితి మారుతుందని పేర్కొన్నారు. వరి పంట వేసిన రైతులు కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. పొలాల్లోకి నీరు చేరితే వెంటనే బయటకు తొలగించాలని పలు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

# ఏలేరు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండండి




**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 28:** ఏలేరు జలాశయానికి ఇన్ ఫ్లో పెరిగే అవకాశం ఉందని, కావున దిగువ ప్రాంతాల్లో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్, కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆదేశించారు. మంగళవారం ఇరిగేషన్, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లతో జగ్గంపేట మండలం ఇర్రిపాకలోని ఏలేరు ఏటిగట్లను ప్రతిష్ట పరిచే చర్యలను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలేరు ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి ఎక్కువ మొత్తంలో నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నుంచి అధిక శాతం నీరు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏలేరు, సుద్దవాగు ప్రభావిత మండలాల్లో తహశీల్దార్లు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. కిర్లంపూడి మండలంలోని వీఆర్ఓలు హెడ్ క్వార్టర్‌లో ఉండి ఎటువంటి సంఘటనలు జరిగిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎక్కడా ఏ చిన్న ఇబ్బంది జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను పునరావస కేంద్రాలకు తరలించాలన్నారు. అవసరమైన చోట రిలీఫ్ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నవీన్ ఆదేశించారు. బలహీనంగా ఉన్న గట్లను ముందే గుర్తించి అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముంపు ప్రాంతాల పరిధిలో గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు, పిల్లలను ముందుగానే ఆసుపత్రులకు తరలించడం తోపాటు ముంపు గ్రామాల ప్రజలను రిలీఫ్ కేంద్రాలకు తరలించాలని ఆయన ఆదేశించారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను నవీన్ ఆదేశించారు. ప్రమాద స్థాయిలో ఏలేరు నీటిమట్టం ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఏలేరు రిజర్వాయర్‌కు వరద నీరు చేరడంతో నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరుకుంది. అని ఏలేరు పరివాహ ప్రాంతాలని అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎస్సై రఘునాథరావు, భూపాలపట్నం ప్రసాద్, జ్యోతుల సత్యమూర్తి, వీఆర్వో, ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వలస మహిళా కూలి మృతి.



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 28:**మండలంలోని చొప్పెల్ల కొండాలమ్మ గుడి సమీపంలో 216 ఏ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో వలస మహిళా కూలి మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం %ా% ఒడిశా రాష్ట్రం, కోరాపుట్ జిల్లాలో అంపబలిలోని దొండగూడకు చెందిన వలస మహిళా కూలి ఖిల రమ (40) మండలంలోని చొప్పెల్ల ఇటుక బట్టీలలో తన భర్త సుధ తో కలిసి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి జాతీయ రహదారి పైకి బహిర్భూమికి వెళ్లేందుకు వచ్చిందన్నారు. ఇంతలో గుర్తు తెలియని వాహనం రమ ను ఢీకొని వెళ్లిపోయింది. దీంతో తీవ్ర గాయాలతో రమ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. అలాగే మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి అనంతరం బంధువులకు అప్పగించారు.

## అనుక్షణం అధికారుల పర్యవేక్షణలో

**రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సుడిగాలి పర్యటన**





**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ 28:**రాజానగరం నియోజకవర్గ ప్రభుత్వ శాఖల అధికారులందరూ మొంధా తుఫాను నేపథ్యంలోఅధికారులందరూ సమిష్టిగా కలిసిమెలిసి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మంగళవారం సీతానగరం మండలంలో ముగ్గళ్ళ పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు ఎల్లవేళలా ఒకే విధంగా ఉండవని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాను గాలులు, వర్షపాతం అధికంగా ఉన్న ప్రాంతాలను అధికారులు అప్రమత్తం చేయాలని త్రాగునీరు, విద్యుత్ సౌకర్యాల పట్ల ఎల్లవేళలా పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్స్ ను ప్రజలందరూ సంప్రదించేందుకు అధికారులు ప్రజల్లో ప్రచారం చేయాలని తెలిపారు. తుఫాన్ కారణంగా ముంపు ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి తుఫాన్ తీవ్రతను వివరిస్తూ పునరావస కేంద్రాలకు తరలి వెళ్లాలని ప్రజలను కోరారు. పునరావస కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన మందులను పరిశీలించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి తుఫాన్ తీవ్రతను తెలుపుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పునరామ కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేశారని వెంటనే గృహాల నుండి కేంద్రాలకు తరలి వెళ్లాలని కోరారు. అధికారులు ఏమాత్రం అప్రమత్తంగా ఉండాలని బాధితులకు అందించే ఆహార పదార్థాలు ఇతర సౌకర్యాల విషయంలో చొరవగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాంప్రసాద్, తహసిల్దార్ ఏ శ్రీనివాస్, ఎంపిడిఓ ఎమ్ భారతి, అర్ ఐ నవీన్, డి టి సునీత, సి ఐ సత్య కిషోర్, ఎస్ ఐ రామ్ కుమార్, అర్ ఎన్ బి ఏ ఈ వీరన్న బాబు, పంచాయితీ ఏ ఈ జోయెల్, హౌసింగ్ ఏ ఈ సుబ్రమణ్యం, అర్ డబ్ల్యూ ఎస్ ఏ ఈ ప్రకాష్, వైద్య అధికారి డాక్టర్ చైతన్య, అగ్రికల్చరల్ ఏ ఈ గౌరీ దేవి, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్ర కాలువ సమస్య పరిష్కారానికి మంత్రి లోకేష్ హామీ-ఎమ్మెల్యే మద్దిపాటి



**గోపాలపురం,పెన్ పవర్ అక్టోబర్ 28:**నియోజకవర్గ పరిధిలో ఉన్న ఎర్ర కాలువ సమస్య శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. తుఫాన్ కారణంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఇటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెంకట్రాజు సూచించారు. మంగళవారం ఎమ్మెల్యే ఎర్ర కాలువ పరివాహక ప్రాంతంలో ట్రాక్టర్ లో రైతులతో కలిసిపర్యటించారు. కాలువ ఉధృతి కాలువ కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు రైతులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే సమస్యను మంత్రి నారా లోకేష్ దృష్టికి ఫోన్లో తీసుకువెళ్లారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పదివేల మందికి ఆహారం, త్రాగునీరు,108 అత్యవసర వాహనాలు, మందులు వంటివి ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే మంత్రికి వివరించారు. రైతులు సైతం మంత్రికి సమస్యను విన్నవించారు. స్పందించిన లోకేష్ కాలువ సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే తో ఆయన మాట్లాడుతూ ప్రజలతో కలిసి నిరంతరం పర్యటించాలని, ఎక్కడ ఏ రకమైన ఇబ్బంది తలెత్తకుండా చూడాలన్నారు. తుఫాను ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంట కూటమి నాయకులు, రైతులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పూరి గుడిసెలు, శిధిలావస్థకు చేరిన ఇల్లు, రేకు షెడ్లలో ఉన్నవారు పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని కోరారు. కేంద్రాలలో ఉన్న వారిని అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. అవసరమైతే తప్ప ఎవరూ బయటికి రావద్దని నాయకులు, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిస్థితిని గమనించి అందుకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.

## తెలికచర్లలో తుఫాన్ సహాయక చర్యలు-సర్పంచ్ నాగరాజు



**గోపాలపురం/నల్లజర్ల, పెన్ పవర్, అక్టోబర్ 28.** నియోజకవర్గంలోని నల్లజర్ల మండలం తె లికిచర్ల గ్రామంలో వరద సహాయక పునరావాస కేంద్రంఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ బండి చిన్న నాగరాజు(చిట్టిబాబు) తెలిపారు. స్థానిక శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు, కూటమి నాయకులు, గ్రామస్తుల సహకారంతో గ్రామంలో మురికి నీటి కాలువల పూడికతీత, పంచాయతీ త్రాగునీటి పైపులైన్ల పునరుద్ధరణ, గ్రామ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లు, కొమ్మలను యంత్రాల, మనుషులు సహాయంతో తొలగించుట వంటి కార్యక్రమాల్ని చేపట్టారు. అలాగే గ్రామంలో పర్యటించి పూరి గుడిసెలు, శిథిలావస్థకు చేరిన గృహాల్లో ఉండే వారిని గుర్తించి వారితో మాట్లాడి తుఫాను ప్రమాదాన్ని వారికి తెలియజేసి చైతన్యపరిచారు. సుమారు 200 మంది బాధితులను స్థానికంగా ఉన్న జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తీసుకు వెళ్ళామన్నారు. పాఠశాలలో వారికి కావలసిన భోజన తదితరవసతుల్ని ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ నిరంతరం గ్రామంలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తున్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా వెంటనే తనకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. సర్పంచ్ వెంట జనసేన నాయకులు రుద్ర శ్రీనివాస్, గ్రామ మాజీ సర్పంచులు వీరమల్ల అనిల్ కుమార్, రామకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ బండి సుబ్బారావు, గోపాలపురం ఏఎంసీ డైరెక్టర్ ఆకుల శ్యామ్, వీఆర్వో శామ్యూల్, కార్యదర్శి రాంబాబు, కూటమి నాయకులు అన్నవరం, వాకల అంజి, చింత శ్రీను, కోమలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పలంకలో 200 మందికి సురక్షిత ఆశ్రయం, అప్రమత్తంగా అధికార యంత్రాంగం



**కరప, పెన్ పవర్, అక్టోబరు 28:** మొంధా తుఫాను ప్రభావం దృష్ట్యా ఏ విధమైన ప్రాణ నష్టం జరగకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు పకడ్బందీగా చేపట్టారు. కరప తహసిల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో, ఉప్పలంక గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో మంగళవారం వరకు మొత్తం 200 మందిని సురక్షితంగా తరలించి, వారికి నివాసం కల్పించడం జరిగింది. తుఫాను ప్రమాదం పూర్తిగా తొలగిపోయే వరకు వీరంతా ఈ కేంద్రంలోనే సురక్షితంగా ఉండేలా అన్ని ఏర్పాట్లు చేశారు. పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలకు అవసరమైన కనీస సదుపాయాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. వారికి త్రాగునీరు, వేడి వేడి ఆహారం, అత్యవసర వైద్య సేవలు, ఇతర ముఖ్యమైన సదుపాయాలు నిరంతరాయంగా అందిస్తున్నారు. సంబంధిత రెవెన్యూ, పంచాయతీ, మెడికల్, పోలీస్ శాఖల సిబ్బంది కేంద్రంలో విధులు నిర్వహిస్తూ, ప్రజల భద్రతకు అవసరమైన ప్రతి చర్యనూ తీసుకుంటున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్ ప్రజలు, మత్స్యకారులను ఉద్దేశించి మాట్లాడుతూ, అధికారులు ఇస్తున్న సూచనలను తప్పనిసరిగా పాటించాలని, తుఫాన్ పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు ఎవరూ బయటకు రాకుండా సురక్షితంగా ఉండవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తోట సునీత, ఆర్ఐ పవన్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గోపాలపురంలో ప్రాచీన శిలా విగ్రహం లభ్యం



**గోపాలపురం,పెన్ పవర్, అక్టోబర్ 28:**స్థానికంగా ఉన్న సా మిల్లు వద్ద పురాతన శిలా విగ్రహం బయటపడింది. వివరాల్లోకెళ్తే గోపాలపురం శాఖ గ్రంథాలయం వద్ద గత వందేళ్ళ కిందట శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి ఆలయం నిర్మించారు. అయితే ప్రస్తుతం ఆలయం కొంత శిధిలావస్థకు చేరుకుంది. భక్తులు, గ్రామస్తులు ఆలయాన్ని పునరుద్ధరించాలని ఉద్దేశంతో ప్రాచీన ఆలయంలోని విగ్రహాలను వేరే చోట భద్రపరిచి ఆలయాన్ని తొలగించారు. పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ఆ మట్టిని బయటకు తరలించారు. స్థానికంగా ఉన్న సా మిల్లు యజమానులు మిల్లు ప్రాంగణంలో ఆ మట్టి పోయించుకున్నారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ పాత మట్టిలో నుండి రాతితో చెక్కబడిన విగ్రహం బయటపడింది. ఆ విగ్రహాన్ని స్థానికుల సహాయంతో బయటకు తీసి శుభ్రంగా కడిగి చూడగా పురుషుడు ఆయన తలపై చిన్న సైజులో ఉన్న స్త్రీ విగ్రహం ఉంది. అవి సీతారాముల విగ్రహంగా భావించిన గ్రామస్తులు పూజలు చేయడం ప్రారంభించారు. ఆ విగ్రహాన్ని అక్కడనుండి పురాతన విఘ్నేశ్వర స్వామి వారి ఆలయానికి తీసుకువచ్చి తాత్కాలిక ప్రదేశంలో ఉంచారు. అయితే 1500 సంవత్సరాల క్రిందటి సీతారాముల విగ్రహం బయటపడింది అన్న విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు తండోపతండాలుగా అక్కడికి చేరి పూజలు చేస్తున్నారు.

## భీమోలు పెద్ద చెరువు గట్టుపై ఇసుక బస్తాలు ఏర్పాటు-కార్యదర్శి ఫాతిమా




**గోపాలపురం, పెన్ పవర్ అక్టోబర్ 28.**భీమోలు పెద్ద చెరువుగట్టు పటిష్టతకు చర్యలు తీసుకుంటున్నామని, తుఫాను కారణంగా భీమోలు గ్రామంలో ఎ టువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నామని గ్రామ కార్యదర్శి ఫాతిమా బీబీ తెలిపారు. గ్రామ సర్పంచ్ వెంకటలక్ష్మి పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించమన్నారు. ప్రమాద భరితంగా ఉన్న పూరి గుడిసెలు లో నివసించే వారిని గుర్తించి వారికి తుఫాన్ వల్ల జరిగే ప్రమాదాన్ని వివరించి చైతన్య పరిశ్రమన్నారు. అటువంటివారిని స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంకు తరలించామన్నారు. వారికి దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చూసుకుంటున్నామన్నారు. గ్రామంలో టాంటాం ద్వారా ప్రమాద హెచ్చరికలను జారీ చేశామన్నారు. విద్యుత్ విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని గ్రామస్తులకు సూచించామన్నారు. ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే అధికారులు తీసుకురావాలని కోరామన్నారు. ఇలా ఉంటే గ్రామ శివారులో ఉన్న పెద్ద చెరువు పూర్తిస్థాయిలో నీటితో నిండి ఉందన్నారు. అయితే ఆ చెరువు గట్టు అక్కడ కాస్త బలహీనంగా ఉన్న విషయాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి గుర్తించామన్నారు. గట్టు కోతకు గురికాకుండా ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. గట్టు పటిష్టతకు అధికారులు ఏర్పాటు చేసిన ఇసుక బస్తాలను గట్టు బలహీనంగా ఉన్న ప్రదేశాల్లో అడ్డుగా వేశామన్నారు. గ్రామ కార్యదర్శిగా తాను గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఫాతిమా తెలిపారు.

# మొంథా తుపాన్ ప్రభావం పట్ల రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలి.

* జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఎన్ విజయకుమార్.



**కిర్లంపూడి, పెన్ పవర్ అక్టోబర్, 28:**మొంథా తుఫాను ప్రభావం పట్ల రైతులు పలు జాగ్రత్తలు వహించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్ విజయకుమార్ అన్నారు. కిర్లంపూడి మండలం రాజుపాలెం రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చేసిన రైతుల సమావేశానికి కాకినాడ జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ విజయ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ తుఫాన్ కు తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు.ఎక్కడైనా పొలాలు కోతకు సిద్ధంగా ఉంటే కోతలు నిలిపివేయవలసిందిగా తెలియజేసారు. మడుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా చేలు గాలికి పడిపోయి ఉంటే పైకి లేపి కట్టలు కట్టుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులతోపాటు ఏఈఓ ఆకుల సురేష్, గ్రామ వ్యవసాయ సహయకులు పార్వతీ,రమ్య, మంజూష, పలువురు రైతులు పాల్గొన్నారు.

# తుఫాన్ ప్రజలను అప్రమత్తం చేసిన కూటమి నాయకులు





**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్28:**మొంథా తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న కారణంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పూరి గుడిసెల్లో ఉన్న కుటుంబాలు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాల్లోకి వచ్చి సురక్షితంగా ఉండాలని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కో కన్వీనర్ దాసరి వి వి సత్యనారాయణ. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యనిర్వాహన కార్యదర్శి పెదపూడి శ్రీనివాస్ రావు లు గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేసారు. మండలంలోని కె. పెదపూడి పుల్లేటికుర్రు గ్రామాల్లో పర్యటించి పూరి గుడిసెల్లో ఉన్న కుటుంబాలు నివసించే ప్రాంతాలకు వెళ్ళి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరవాస కేంద్రంలోకి వచ్చి ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన ఏర్పాట్లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పబ్బినీడి రాంబాబు పుల్లేటికుర్రు సొసైటీ త్రీ మెన్ కమిటీ చైర్మన్ దొమ్మేటి సురేష్. పెదపూడి జనసేన పార్టీ అధ్యక్షులు గోలకోటి నరేష్. ఎన్ డి ఏ కూటమి నాయకులు నేదునూరి పెద్దిరాజు, దాసరి శ్రీను.చిట్టూరి హరికృష్ణ. నేదునూరి బాబులు. మోకా శ్రీను, బొరుసు రాజా. బండి అర్జున్. నందెపు సత్యనారాయణ ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు

# రహదారిపై చెట్టును తొలగించిన పోలీస్ సిబ్బంది



**ఆలమూరు, పెన్ పవర్,అక్టోబర్ 28:**మొంథా తుఫాను ప్రభావంతో ఆలమూరు మండలంలో మంగళవారం ఈదురుగాలులు కొనసాగుతున్నాయి. జొన్నాడ 216(ఏ) నెంబర్ గల ప్రధాన జాతీయ రహదారిపై భారీ చెట్టు విరిగి రోడ్డుపై పడింది. అదృష్టవశాత్తూ ఘటన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. చెట్టు కారణంగా కొంతసేపు రాకపోకలు అంతరాయం కలిగించాయి. సమాచారం అందుకున్న ఆలమూరు ఎస్సై నరేష్ తమ సిబ్బందితో కలిసి ఘటనాస్థలనికి చేరుకుని భారీ ప్రోక్లైన్ సహకారంతో చెట్టును పక్కకు తరలించారు. దీనితో వాహనాల రాకపోకలు మళ్లీ సజావుగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం కొనసాగుతున్నందున ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావొద్దని సూచించారు. రహదారిపై ప్రయాణించే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకర స్థితులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. తుఫాన్ కారణంగా ఎక్కడా పెద్ద ప్రమాదాలు జరగకపోవడం సంతోషకరమని ఎస్సై నరేష్ పేర్కొన్నారు. ఈ చర్యలతో రహదారి రాకపోకలు పూర్తిగా సాధారణ స్థితికి చేరగా, ప్రజలు పోలీసుల చురుకైన చర్యలను అభినందించారు.

# నూతన ఏజెన్సీజిల్లాను ఏర్పాటుచేయాలి.

* ఆదివాసి గిరిజన సంఘం నాయకులు




**వి.ఆర్.పురం పెన్.పవర్.అక్టోబర్.28:**రంపచోడవరం కేంద్రంగా మరో ఏజెన్సీజిల్లాను ఏర్పాటు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ ప్రకటన ద్వారా ప్రభుత్వాన్నికోరారు. ఈసందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులిసంతోష్ కుమార్, మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసే నూతన జిల్లాలో రంపచోడవరం కేంద్రంగా నూతన ఏజెన్సీ జిల్లాను ప్రకటించాలని,ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంగాఉన్న పాడేరు వెళ్లాలంటే విలీనమండలాల ప్రజల కు,రంపచోడవరం నియోజకవర్గ ప్రజలకు చాలా దూరం కావడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.దీనివలన సమస్యలు పరిష్కారం జాప్యం జరుగుతుందని,కలెక్టర్,ను కలవాలని,ఉన్న వెళ్ళి కలవలేని పరిస్థితుల్లో ప్రజలు ఉంటున్నారని,తెలిపారు. ఒకపక్క పోలవరం ప్రాజెక్టు కారణంగా తీవ్రంగా నష్టపోతున్నఎటపాక,కూనవరం,వరరామచంద్రాపురం,చింతూరు, దేవీపట్నం,మండలాల ప్రజలు నిర్వాసితుల సమస్యల పరిష్కారంకాక,ఆందోళన చెందుతున్నారని,ప్రస్తుతం రంపచోడవరంలోఉన్న ఏడు మండలాలను విలీన మండలాలైన నాలుగు మండలాలను,ఏలూరు జిల్లాలోని నాలుగు మండలాలను మరియు నాన్ షెడ్యూల్,ప్రాంతం లోఉన్న గిరిజన గ్రామాలను కలుపుతూ రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయడం వలన నిర్వాసితుల సమస్యలు త్వరగా పరిష్కారం అవ్వడానికి అవకాశం ఉందన్నారు. తక్షణమే నూతన జిల్లాల ప్రతిపాదనలో రంపచోడవరం కేంద్రంగా మరో ఏజెన్సీ జిల్లా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటన చేయాలని,డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు పూనెం ప్రదీప్ కుమార్,పొడియం శ్రీరామూ ర్తి,తుర్రం బాబురావు,మిడియం సీతయ్య,గొర్రె వెంకటేశ్వ ర్లు,తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి దర్శనానికి భక్తుల రద్దీ





**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 28:**కోనసీమ తిరుమల, వాడపల్లి కి తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు కోనసీమ తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు తరలివస్తున్నారు. మంగళవారం ఆలయ సన్నిధిలో విశిష్ట పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వసంత మండపంలో ఏడువారాల పూజలు పూర్తిచేసుకున్న భక్తులు అష్టోత్తర నామార్చన పూజలు ఆచరించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.అనంతరం ఆలయ అన్నదాన పథకానికి రాజమండ్రికి చెందిన నాదేళ్ల సుబ్రహ్మణ్యం%-%లక్ష్మి దంపతులు కుటుంబ సమేతంగా రూ.50,116 విరాళం అందజేశారు. వీరిని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, అసిస్టెంట్ అధికారి స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు.

# మొంథా తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.



-పెద్దాపురం ఆర్డీఓ కె శ్రీరమణి

**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్ 28:**మొంథా తుఫాను పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం ఆర్డీఓ,కె శ్రీరమణి అన్నారు

కిర్లంపూడి మండలంలో ఏలేరు పరివాహక ప్రాంతాలలో తుఫాన్ ప్రభావంతో కాలవలు పొంగి ప్రవహిస్తున్నాయి.

దీంతో ఏలేరు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు,కిర్లంపూడి మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎండిఓ హరికృష్ణ, తహసీల్దార్ చిరంజీవి,లతో కలసి ఆర్డీఓ శ్రీరామణి ఏలేరు పరివాహక గ్రామాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తుఫాన్ ప్రభావం ఏ సమయంలో ఏ విధంగా ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొని ఉందని అన్నారు.

తుఫాన్ తీరం దాటేటప్పుడు 90 నుండి 120 కిలోమీటర్ల వేగంతో బీకరగాలులు వేస్తాయాన్నారు

ప్రజలందరూ అధికారులకు సహకరించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి సూచించారు



# నెల్లిపూడి లో అత్యంత వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ







**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 28 :** మండలంలోని నెల్లిపూడి లో అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. సోమవారం రాత్రి నెల్లిపూడి గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద గురు స్వామి కోలా చిట్టిబాబు ( కొండబాబు) స్వామి మాలదారులు ముచ్చకర్ల శివ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. నరేంద్రపురం వేద పండితులు, గురుస్వామి రామకృష్ణ దీక్షితులు వేద మంత్రోచ్ఛరణ తో స్వామివారికి గణపతి పూజ, పుణ్యాహ వచనం, కలసపూజ , 18 రకాల ద్రవ్యాలతో అయ్యప్ప స్వామికి అభిషేకం, అఖండ హారతి పడిపూజ ఎంతో వైభవంగా నిర్వహించారు. పూజ అనంతరం అయ్యప్ప స్వామి మండపాన్ని భక్తులు దర్శించుకుని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30 మంది గురుస్వాములకు దుస్సాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. మొల్లేరు గురు స్వామి కాశీ స్వామి , పాము అర్జున స్వామి (బూరిబాబు స్వామి) , కొత్తపల్లి రంగస్వామి వెంకటేశ్వరరావు స్వామి సాయి స్వామి, మల్లవరం కృష్ణ స్వామి కొండలు స్వామి, కామరాజుపేట రఘు స్వామి జాజుల ప్రసాద్ స్వామి, నెల్లిపూడి స్వాములు అశోక్, బాబి, శివ, దుర్గ, బాబి , అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు. 400 మంది అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

# మొంథా తుఫాను పర్యవేక్షణ: పునరావాస కేంద్రాల్లో ప్రజల సమస్యలు తెలుసుకున్న రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు







**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 28:** మొంథా తుఫాను ప్రభావం తీవ్రంగా ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో, కాకినాడ జిల్లాలో జాగ్రత్త చర్యలను రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు.జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, పలు అధికారులతో కలిసి పునరావాస కేంద్రాలు, తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఏర్పాట్లను పరిశీలించారు.ఏటిమొగ, దుమ్ములుపేట, పర్లోవపేట ఏఎంజీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న ప్రజలను పరామర్శిస్తూ, వారికి అందిస్తున్న భోజన పదార్థాల నాణ్యతను పరిశీలించారు.సూర్యకళామందిరం వద్ద సిద్ధం చేసిన వంటలను స్వయంగా రుచి చూస్తూ నాణ్యతపై సూచనలు చేశారు. అనంతరం పర్లోవపేట ఏఎంజీ పాఠశాలలో ఉన్న ప్రజలకు స్వయంగా భోజనం వడ్డించారు.తాళ్లరేవు మండలం గాడిమొగలోని ధీరుభాయ్ అంబానీ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించిన సానా సతీష్ బాబు, అక్కడి ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకొని ప్రజలకు భోజనం వడ్డించారు.జిల్లాలో మొత్తం 18 మండలాల్లో 67 గ్రామాలు, 5 పట్టణ ప్రాంతాల్లో తుఫాను ప్రభావం ఉందని అధికారులు వివరించినట్టు ఎంపీ తెలిపారు. ప్రమాదాల నుండి ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంద న్నారు. తీవ్ర గాలులు, భారీ వర్షాలు ఆశించబడుతున్న వేళ ఎవ్వరూ బయటకు రావద్దని, అధికారులు సూచనలు పాటించాలని ప్రజలను కోరారు.

## తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులు విద్యుత్ కు అంతరాయం.



**ఏలేశ్వరం, పెన్ పవర్ , అక్టోబర్ 28:** మొంథా తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా ఉదయం నుంచే ఈదురుగాలులు, వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాల కారణంగా అనేక ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు దెబ్బతిని విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో త్రాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. విద్యుత్ లేక మోటార్లు పనిచేయక, గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ విద్యుత్ శాఖ అధికారులతో నిరంతరం మాట్లాడారు. ఫలితంగా, విద్యుత్ అధికారులు అత్యవసర చర్యలు తీసుకుని దెబ్బతిన్న లైన్లను మరమ్మతు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ ఉన్నంతవరకు మోటార్లు వేసి ట్యాంకులు నింపి గ్రామ ప్రజలకు త్రాగునీరు అందించాలంటూ ఎంపీడీవో సిహెచ్ రవికుమార్ రాజు, అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

# మొంథా తుపాను తీవ్ర రూపం







**నేలకొరిగిన విద్యుత్ స్థంబాలు, కొబ్బరి, భారీ వృక్షాలు**

**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్, 28**మొంథా తుపాను తీవ్ర రూపం దాల్చి ఈదురుగాలులు వీయడంతో అంబాజీపేట మండలంలో కొబ్బరి చెట్లు, విద్యుత్ స్థంబాలు నేలకొరిగాయి. పుల్లేటికుర్రు, కె. పెదపూడి, ఇరుసుమండ: గంగలకుర్రు, అంబాజీపేట, మాచవరం, వాకలగరువు, తొండవరం, నందంపూడి, చిరతపూడి, ఇసుకపూడి, మొసలపల్లి, వక్కలంక గ్రామాల్లో కొబ్బరి చెట్లు ప్రధాన రహదారులతో పాటు నివాస ప్రాంతాల్లోను నేలకొరిగాయి. పుల్లేటికుర్రు, వక్కలంక గ్రామాల్లో విద్యుత్ స్థంబాలపై కొబ్బరి చెట్లు పడటంతో విద్యుత్ వైర్లు, స్థంబాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రహదారులకు ఆడ్డంగా పడిని వాటిని సహాయక సిబ్బంది తక్షణమే తొలగించారు. పుల్లేటికుర్రు జోన్నాడవారిపేటలో కొల్లి సత్యవతి తాటాకిల్లు నేలమట్టమైంది. వక్కలంకలో జి. వీరవెంకట సత్యనారాయణ ఇంటిపైన కొబ్బరి చెట్టు పడింది. అలాగే కె.పెదపూడిలో సచివాలయం ఎదురుగా ఉన్న ఓ డాబా పై భారీ వృక్షం పడింది. రెవెన్యూ, విద్యుత్ శాఖ, గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది తక్షణ మే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో ఎవ్వరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

## తుఫాను ప్రభావానికి సమర్థవంతమైన చర్యలు ప్రజలంతా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలి





**పునరావాస కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**రావులపాలెం,పెన్ పవర్ అక్టోబర్ 28 :**మొంథా తుఫాను తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షణలో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం విపత్తును ఎదుర్కొనేందుకు పూర్తిస్థాయిలో సిద్ధమైందని ఆయన తెలిపారు.
మంగళవారం ఎమ్మెల్యే బండారు రావులపాలెం మండలం రావులపాడు, కొత్తపేట మండలం వానపల్లి శివారు సంఘంపాలెం పునరావాస కేంద్రాలను ఆర్డీవో శ్రీకర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ు పూరిగుడిసెలు, రేకు షెడ్లు, శిథిల ఇళ్లలో నివసిస్తున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని చెప్పారు.నియోజకవర్గంలో మొత్తం 111 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, అందులో రావులపాలెంలో 42, ఆత్రేయపురంలో 21, ఆలమూరులో 22, కొత్తపేట మండలంలో 26 కేంద్రాలు ఉన్నాయని వివరించారు.
రావులపాడు కేంద్రంలో నంద్యాల జిల్లాకు చెందిన 90 కుటుంబాలు ఆశ్రయం పొందుతున్నాయని తెలిపారు.కేంద్రాల్లో ఆశ్రయం పొందిన వారికి స్వయంగా భోజనం వడ్డించిన ఎమ్మెల్యే బండారు, ప్రజలంతా పునరావాస కేంద్రాలకు తరలివచ్చి సురక్షితంగా ఉండాలని సూచించారు. చిన్నపిల్లలు, గర్భిణీలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులు తమ పశువులను కూడా రక్షణలో ఉంచాలని సూచించారు.తుఫాను రాత్రి తీరం దాటనున్న నేపథ్యంలో అన్ని ముందస్తు చర్యలు పూర్తయ్యాయని, ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని హెచ్చరించారు.
"ప్రాణ, ఆస్తి, పశు నష్టం జరగకుండా ప్రతి ఒక్కరు బాధ్యతతో వ్యవహరించాలి. సహాయం అవసరమైతే నన్ను నేరుగా సంప్రదించండి," అని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. సంప్రదించవలిచిన::
98492 43777, 80082 43777
ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, కంఠంశెట్టి శ్రీనివాస్, పల్లి భీమరావు, కొప్పిశెట్టి ప్రసాద్, గనిశెట్టి వీరేష్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## తుఫాన్ పై సమీక్షఅధికారులను అప్రమత్తం చేసిన గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్.



**అడ్డతీగల, పెన్ పవర్, అక్టోబర్ 28:** మంగళవారం రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరు మేలనాటి. రుక్మగ్దయ గ్రామ పంచాయతీ కార్యదర్శులతో మంతా తుఫాన్ పై సమీక్షి నిర్వహించారు.
మంగళవారం మంతాతుఫాన్ తో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు ఎవరికి ఏ రకమైన ప్రాణ నష్టము జరగకుండా,మండలములో వేటమామిడి గ్రామ పంచాయతీ పనకు రాతిపాలెం పెద్దేరు వాగు మరియు భీముడుపాకలు గ్రామ పంచాయతీ పింజరి కొండ వాగులకు, సంబంధించి అక్కడి ప్రజలను వాగు దాటకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిందిగా, సంబంధిత గ్రామ పంచాయతీ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేశారు.
రాబోవు 36 గంటలలో మంతా తుఫాన్ తీవ్రతను బట్టి, ప్రజలందరనీ చైతన్యపరచి అప్రమత్తం చెయ్యవలసినదిగా అడ్డతీగల తాసిల్దార్ దొరకయ్య ఆదేశాలు జారీ చేశారు . మరియు తుఫాను సంబంధించి ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరిగిన వెంటనే తహశీల్దారు వారి కంట్రోల్ రూమ్ కు 24/7 మరియు ఎంపిడిఓ కార్యాలయమునకు 24/7 వెంటనే తెలియజేయాలని తాసిల్దార్ ఆదేశాల జారీ చేశారు .
ప్రకృతి వైపరీత్యాలు సంబంధించి ఎవరూ కూడా అలసత్వం వహించ వద్దని తాత్కాలికముగా మూడు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని అధికారులు తెలిపారు . పునరావాసకేంద్రాలు వివరాల్లోకి వెళితే
జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్, అడ్డతీగల,
రైతు భరోసా కేంద్రం మరియు పాత గ్రామ పంచాయతీ బిల్డింగ్ వేటమామిడి,
భీముడుపాకలు గ్రామపంచాయతీ, పింజరికొండ వద్ద కొత్తపాలెం ఎంపీపీ స్కూల్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.
ఈ సమావేశములో తహసీల్దార్ ఎన్. దొరకయ్య,ఎంపిడిఓ ఏ.వి. వి కుమార్, రెవిన్యూ సిబ్బంది పంచాయతీ సెక్రటరీలు తుఫాన్ సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## తుఫాన్ నేపథ్యంలో ప్రజలు, అధికారులూ అప్రమత్తంగా ఉండాలి....

పునరావాస కేంద్రాల పరిశీలన...





**కపిలేశ్వరపురం పెన్ పవర్ అక్టోబర్ 28.** మొంథా తుఫాన్ నేపథ్యంలో కపిలేశ్వరపురం మండలం, వల్లూరు, టేకి,కేదార్లంక్ తదితర అన్ని గ్రామాలలో ప్రభుత్వం వారు ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను అవసరమైన ప్రజలందరూ.ఉపయోగించుకోవాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు.రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి చైర్మన్ వెగుళ్ళ లీలా కృష్ణలు అన్నారు. వల్లూరు, టేకి గ్రామాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సంధర్భంగా అక్కడి ప్రజలతో మాట్లాడి ఆందోళన చెందనవసరం లేదని, తుఫాను ప్రభావం తగ్గేవరకు ఈ పునరావాస కేంద్రంలో సురక్షితంగా ఉండవచ్చునన్నారు. ఇళ్ళు సరిగా లేని వారు, ముంపు ప్రాంతాల ప్రజలు, అవసరమైన వారంతా ఈ పునరావాస కేంద్రాలను ఉపయోగించుకోవాలన్నారు. ఎక్కడా ఎటువంటి నష్టం జరగకుండా కూటమి ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటమే కాకుండా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చెయ్యటం జరిగిందన్నారు. తుఫాన్ ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు, బలమైన ఈదులు గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ ఒక్కరూ మంచినీటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. అందుకు సంబంధించి అధికారులకు ఆదేశాలు ఇవ్వటం జరిగిందన్నారు. అనంతరం పునరావాస కేంద్రాలలో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంప్ లను ఎమ్మెల్యే వేగుళ్ళ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు మచ్చా నాగు, వల్లూరి వీరబాబు, ముత్యాల శ్రీధర్, గుణ్ణం సుబ్బరాజు, వేగుళ్ళ ప్రసాద్, దాసి మీనాకుమారి, దామిన వీర్రాఘవులు, మేడిశెట్టి శ్రీనివాస్, చింతా సత్యనారాయణ, కడలి పనసరామన్న, మేడిశెట్టి మణికంఠస్వామి, కొత్తపల్లి కృపావరం, తీగిరెడ్డి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు...

## పునరావాస కేంద్రాల్లో ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు.



**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్ 28:**మొంథా తుఫాను ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో వరద బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలకుండా అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని ఎంపీడీఓ బావిశెట్టి హరికృష్ణ తెలిపారు, కిర్లంపూడి మండలం రాజుపాలెం,శృంగరాయూనిపాలెం, ఎస్ తిమ్మాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో భోజన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. వరద ముంపు ఉన్న బాధిత కుటుంబాలు పునరావాస కేంద్రానికి తరలి రావాలని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు

## జిల్లా డిఆర్డిఏ పీడీ, నియోజకవర్గం ప్రత్యేక అధికారి జయచంద్ర గాంధీ







**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబరు ,28:**మోంథా తుపాను తీవ్రత అధికంగా ఉండటంతో గ్రామాల్లో ప్రమాధభరితంగా ఉన్న గృహాలను గుర్తించి ఆయా కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నామని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా డిఆర్డిఏ పీడీ, నియోజకవర్గం ప్రత్యేక అధికారి జయచంద్ర గాంధీ తెలిపారు. మండలంలోని ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జయచంద్ర గాంధీ విలేకర్లతో మాట్లాడుతూ నియోజవర్గంలోని అయినవిల్లి, అంబాజీపేట, పి గన్నవరం మండలాల పరిధిలో 280 పునరవాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం మూడు మండలాల్లో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాల్లో 300 కుటుంబాలకు పైగా ఉన్నట్లు ఆయన తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి విద్యుత్, తాగునీరు, భోజన వసతి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. తుఫాన్ తీవ్రత అధికంగా ఉండడంతో "చెట్లు విరుగుపడుతున్నాయని తక్షణమే తొలగించేందుకు విద్యుత్ శాఖ, ఆర్అండ్ బి, పంచాయతీరాజ్ శాఖ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. అనంతరం పుల్లేటికుర్రులో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాన్ని పరిశీలించి నివాసితులతో మాట్లాడారు. ప్రత్యేకాధికారి వెంట తహసీల్దార్ బి. చినబాబు, ఎంపీడీవో బి. మమత, సర్పంచ్ జల్లి బాలరాజు, అధికారులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

# రైతులందరూ అప్రమత్తంగా ఉండాలి

* మండల వ్యవసాయ శాఖ అధికారి గౌరీ దేవి



**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ 28:**మండలంలోని వరి పండించే రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి గౌరీ దేవి అన్నారు. మొంధా తుఫాన్ నేపథ్యంలో పంట పోలంలో పర్యటించి రైతులకు తుఫాను హెచ్చరికలలో భాగంగా సూచనలు చేశారు. ముఖ్యంగా గింజ గట్టి పడే దశలోను కొన్ని చోట్ల పోట్ట దశలోనే ఉన్నాయని ఇప్పుడు అధిక వర్షాలు ఈదురు గాలులు వస్తే. పంట నష్టం అధికంగా ఉండే అవకాశం ఉంది అని తెలిపారు. ముఖ్యంగా వరి పోల్లాలో నీళ్ళు నిల్వ ఉండకుండా బయటకు పోయే మార్గం ఏర్పాటు చేసుకొవాలని సూచించారు. నీటిని తొలంగించిన తర్వాత ఎకరానికి ప్రొపికోనాజోల్ 25 ఈసీ 200ఎంల్ (లేదా) హెక్సకనజోల్ 5 ఎస్సి ఎంల్ పిచికారి చేయాలని సూచించారు. ఇలా చేయడం వల్ల గింజ రంగు మారకుండ పుడ తెగులు మాని పండు తెగులు రాకుండా నివారించుకోవచ్చు న్నారు. పంట పడిపోయిన చోట్ల నిలబెట్టి కట్టాలని, గింజ రంగు మారకుండ ఐదు శాతం ఉప్పు ద్రావణమును పిచికారి చేసుకోవాలన్నారు . ఈ కార్యక్రమంలోఏడిఏ జయ రామ లక్ష్మీ అగ్రికల్చర్ విఏఏలు తదితరులు పాల్గొన్నారు.

# తుపాన్ ప్రభావం తో నగరంలోని మేజర్ డ్రైనేజీల్లో సిల్ట్ తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ అక్టోబర్ 28:**వేసవి కాలంలో చేపట్టవలసిన డ్రైనేజీల్లో సిల్ట్ తొలగింపు ప్రక్రియ లో
నిర్లక్ష్యం వహించిన కార్పొరేషన్ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది తుపాన్ ప్రభావంతో నగరంలోని మేజర్ డ్రైనేజీల్లో సిల్ట్ ను యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నారు. తుపాన్ ప్రభావం తో గత రెండు రోజులుగా నగరంలో వర్షాలు కూస్తున్నాయి. దాంతో లోతట్టు ప్రాంతాల్లో డ్రైనేజీలు,వీధులు వర్షపు నీరు, మురుగు నీరుతో పొంగి ఇళ్లలోకి వచ్చి ఇబ్బందులు పడుతున్నమని ప్రజలు కార్పొరేషన్ అధికారులకు పిర్యాదులు చేయడం జరిగింది. కార్పొరేషన్ కమిషనర్ రాహుల్ కుమార్ మీనా కార్పొరేషన్ హెల్త్ విభాగ అధికారులను అప్రమత్తం చేయడంతో
కార్పొరేషన్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది ఆఘమేఘాలపై కదిలి ట్రాక్టర్ల తో సహా నగరం లోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న మేజర్ డ్రైనేజీల్లో సిల్ట్ తొలగిస్తున్నారు. నగరంలో లోతట్టు ప్రాంతాలుగా ఉన్న లలితా నగర్, మూల గొయ్యి,రామచంద్రరావు పేట, కబేలా డ్రైన్, ఆర్యాపురం నల్లా ఛానల్, ఇన్నీస్ పేట రాతి ఛానల్, జాంపేట మేజర్ డ్రైన్, ఆవ వాంబే కాలనీ, ఆదిమ్మ దిబ్బ మేజర్ డ్రైన్ల లో సిల్ట్ తొలగిస్తున్నారు. వర్షాలు వల్ల తొలగింపు పనులకు ఆటంకం ఏర్పడుతుందని శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది వాపోతున్నారు. పైగా కార్పొరేషన్ లో ట్రాక్టర్ల , సిబ్బంది కొరత ఉందని సిల్ట్ తరలించడం లో కొంత ఆలస్యం జరుగుతుందని సానిటరీ ఇన్స్పెక్టర్లు పేర్కొంటున్నారు. తుఫాను ప్రభావంతో ఇప్పటికైనా డ్రైనేజీల్లో సిల్ట్ తొలగించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

# తుఫాను పర్యవేక్షణ కు కలెక్టరేట్ లో ఏర్పాటైన కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 28:**తుఫాను పర్యవేక్షణ నిమిత్తం మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా ప్రత్యేక అధికారి కే. కన్నబాబు, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై. మెగా స్వరూప్ , మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, ఎస్డీసీ కే భాస్కర్ రెడ్డి లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భం గా పలు విభాగాల సమన్వయంతో పనిచేస్తున్న సిబ్బందికి కన్నబాబు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కే. కన్నబాబు మాట్లాడుతూ, కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా జిల్లాలోని అన్ని మండలాల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కంట్రోల్ రూమ్‌కు వస్తున్న కాల్స్, అందుతున్న సమాచారం పట్ల వెంటనే స్పందించి, సంబంధిత మండలాధికారులను అప్రమత్తం చేయాలని సూచించారు. విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది పాత్ర కీలకమని తెలిపారు.ప్రజల నుంచి వచ్చే ప్రతి సమాచారాన్ని ప్రాధాన్యతగా తీసుకుని, అవసరమైతే వెంటనే క్షేత్రస్థాయిలో సిబ్బందిని పంపించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బహిరంగ ప్రదేశాలకు వెళ్లాలని,
విద్యుత్ తీగలు, చెట్లు, నీటి మునిగిన ప్రాంతాలకు దగ్గరగా వెళ్లరాదన్నారు.
ప్రజలు ఎవరైనా అత్యవసర సమయాల్లో 112 ఎ 1070 ఎ 1800 425 0101 (24ఐ7 సేవలు)అత్యంత అత్యవసర నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

# అంద్రంగి డ్రైన్ పై బ్రిడ్జ్ వద్ద ప్రమాదం - కాజులూరు మండలంలో అధికారుల అప్రమత్త చర్యలు








**కాజులూరు, పెన్ పవర్,అక్టోబర్ 28:** మొంథా తుఫాను ప్రభావంతో కాజులూరు మండల పరిధిలోని అంద్రంగి డ్రైన్ బ్రిడ్జ్ వద్ద వరద నీరు వడిగా ప్రవహించడంతో ప్రమాద పరిస్థితి ఏర్పడినట్టు గొల్లపాలెం ఎస్సై ఎం. మోహన్ కుమార్ తెలిపారు. దీంతోకాజులూరు–దుగ్గుదూరు రహదారిని పూర్తిగా నిలిపివేసి, ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని సూచించారు.

**లోతట్టు ప్రాంతాల్లో రాకపోకలపై పోలీసులు హెచ్చరిక**

తాత్కాలిక కల్వర్టు మునిగిపోయి వాహనదారులకు ప్రమాదం పొంచి ఉండటంతో, అత్యవసరం అయితే తప్ప రోడ్లపైకి రావద్దని స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులు ఆంక్షలు విధించారు. భారీ ఈదురు గాలుల కారణంగా చెట్ల కొమ్మలు, రేకులు ఎగిరిపడుతూ ప్రమాదం పెరుగుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

**గొల్లపాలెంలో చెట్టు కూలి ప్రమాదం తప్పింది**

గొల్లపాలెంలో పోలీస్ స్టేషన్, గ్రామపంచాయతీ సమీపంలో భారీ చెట్టు కూలిపోయినా సద?్విధంగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. చెట్టును వెంటనే తొలగించేందుకు వీఆర్వో శ్రావణి, కార్యదర్శి భాగ్య పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టారు.

**తిరుమల ఫంక్షన్ హాల్ గ్లాస్ పగిలి వాహనాలు దెబ్బతిన్న ఘటన**

తిరుమల ఫంక్షన్ హాల్ మూడో అంతస్తు గ్లాస్ షీట్లు బలమైన గాలులకు పగిలి రోడ్డుపై పడిపోయాయి. ఈ అఘాయిత్యంలో రెండు బైక్‌లు దెబ్బతిన్నాయని స్థానికులు తెలిపారు. రేకులు ఎగిరిపడే ప్రమాదం ఎక్కువగా ఉండటంతో పక్కనే ఉన్న వారు భయాందోళనకు గురవుతున్నారు.

**శలపాక ప్రాంతంలో విద్యుత్ రాకపోకలకు అంతరాయం**

తంగేడు చెట్టు విద్యుత్ తీగలపై పడటంతో రెండు చోట్ల తీగలు తెగిపోయాయి. దీంతో శలపాక, మంజేరు, మొగలిపాలెం, గొల్లపాలెం తదితర గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.అలాగే ఆర్యవటం చందాల వారిపేటలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ పై విరిగి పడ్డచెట్టు.
సర్పంచ్ పోతుల గనిరాజు సహకారంతో విద్యుత్ శాఖ సిబ్బంది పనులు చేసి సేవలను పునరుద్ధరించారు.అయితే మండల పరిధిలో ఎక్కడా ప్రాణనష్టం జరగలేదు.దీంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

**అధికారుల విజ్ఞప్తి**

మండల తహసిల్దార్ జి.ఆర్. ఠాగూర్, ఎంపీడీవో జె. రాంబాబు , ఆర్ ఐ వేగేశ్వరరావు ప్రజలు ఇంటి వద్దే సురక్షితంగా ఉండాలని, సచివాలయం%–%రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని కోరారు.
ఏవైనా అత్యవసర పరిస్థితులు ఉంటే వెంటనే సమాచారమివ్వాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మండల స్థాయి అధికారులతో స్పెషల్ ఆఫీసర్ సమావేశం





**వై రామవరం, పెన్ పవర్, అక్టోబర్ 28:** మండల స్థాయి అధికారులతో మండల స్పెషల్ ఆఫీసర్ దేవానంద్ తుఫాను ప్రభావం పై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సమావేశం నిర్వహించారు.
జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మెంతా తుఫాన్ ప్రభావం వలన ఎటువంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సమావేశంలో తెలియజేశారు. మండలంలో ప్రతి పంచాయతీ పరిధిలో ఉన్న కాలువలు సెలయేర్లలో ఎవరు దిగకుండా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే పై అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశం అనంతరం యార్లగడ్డ గ్రామంలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమీపంలో ఉన్న కొండ కాలువలను సందర్శించారు. అధికారులతో పాటు గ్రామస్తులు అందరూ అప్రమత్తంగా ఉండి ఎటువంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోకే బాపన్న దొర, సర్పంచ్ పి.పద్మావతి, ఎంపీటీసీ కె.సుబ్బలక్ష్మి,సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయరహదారిపై భారీ వాహనాలు నిలుపుదల




**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబరు 28:** మొంథా తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ రహదారిపై భారీ వాహనాలు తిరగకుండా జగ్గంపేట పోలీసులు చర్యలు తీసుకున్నారు. జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాధరావు తన సిబ్బందితో కలిసి భారీ వాహనాలను నిలుపుదల చేశారు. జాతీయరహదారికి పక్కగా ఎటువంటి ఇబ్బంది లేకుండా నిలుపుదల చేసి డ్రైవర్లకు తుఫాన్ ప్రభావంపై అవగాహన కల్పించారు. మంగళవారం రాత్రికి కాకినాడ తీరంలో తుఫాన్ దాటే అవకాశమున్న దృష్ట్యా భారీ వర్షాలు కురుస్తాయని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రాత్రికి ఇక్కడే ఉండి తుఫాన్ తగ్గుముఖం పట్టాక తిరుగు ప్రయాణం చేయాలని డ్రైవర్లకు సూచించారు. ఎడతెరిపి లేని వర్షంలో సైతం భారీ వాహనాలు నిలుపుదల చేసి వారికి అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రఘునాధరావును సానికులు అభినందిస్తున్నారు.

# కోరుకొండ మండలంలో మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సుడిగాలి పర్యటన..





- తుఫాన్ వల్ల ఎవరికి ఏ కష్టం వచ్చినా నేనున్నాను !
- ప్రజలందరికీ అండగా కూటమి ప్రభుత్వం.
- ప్రజలకు ఎమ్మెల్యే బత్తుల రామకృష్ణ ధైర్యం

**కోరుకొండ, పెన్ పవర్, అక్టోబర్ 28:** కోరుకొండ మండలంలో మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సుడిగాలి పర్యటన చేశారు.మంగళవారం రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే బలరామకృష్ణ పర్యటించారు.లోతట్టు ప్రాంతాలను పునరావాస కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు సూచనలు అందించారు. గర్భిణీలను, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని ఎమ్మెల్యే బలరామకృష్ణ అధికారులను ఆదేశించారు.ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పునరావాస కేంద్రంలో ఉన్న వారితో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ ఏ ఒక్కరూ అధైర్య పడవద్దని కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. నియోజకవర్గంలో ప్రజలందరికీ ఏ విధమైన కష్టం వచ్చినా తాను అందుబాటులో ఉంటానన్నారు.తుఫాన్ వల్ల కష్టం వచ్చిందని అధైర్య పడవద్దని ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటామని ధైర్యం అందించారు.తుపాన్ ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం నూరు శాతం పటిష్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. పునరావాస కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు పకడ్బందీ ఏర్పాటు చేయాలని, భోజనం, అల్పాహారం రుచికరంగా ఉండేలా చూడాలన్నారు. బాధితులకు, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ఇబ్బంది పడుతున్న వారిని తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించాలనీ అధికారులకు సూచించారు.మరో రెండు,మూడు రోజులపాటు వర్షాలు ఉన్నందున అవసరమైతే తప్ప బయట ప్రయాణాలు చేయవద్దని ఎమ్మెల్యే బలరామకృష్ణ పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామాల్లో రోడ్లు పూర్తిగా మునిగిపోయి ఉన్నాయని వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ ప్రభావం పై సమీక్షా సమావేశం.






**ప్రకృతి వైపరీత్యాలను అడ్డుకోలేం, నష్ట నివారణ చేయవచ్చు: ఎమ్మెల్యే సత్యప్రభ.**

**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 28:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్పెషల్ ఆఫీసర్ టీవీ సిరిల్ సమక్షంలో మొంథా తుఫాన్ ప్రభావం పై విస్తృతస్థాయి సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో సిహెచ్. రవికుమార్ వర్మ, తహసిల్దార్ కె. కుసరాజు లు మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ ముఖ్య అతిథిగా పాల్గొని మండలంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు, రానున్న తుఫాన్ ప్రభావం దృష్ట్యా తీసుకోవలసిన జాగ్రత్తలు పై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను అడ్డుకోలేము గాని, నష్ట నివారణ చేయవచ్చు అన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏ ఒక్క ప్రాణి కి ప్రాణహాన్ని కలగరాదని, ఇదే ప్రధాన కర్తవ్యం అధికారులు , నాయకులు కష్టించి పనిచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు అన్నారు.

చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలుపట్ల ఐసీడీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రజల భద్రతే ప్రభుత్వానికి ప్రాధాన్యం అని అన్నారు. తుపాను సమయంలో ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, ప్రతి శాఖా అధికారి అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు.

ప్రజల ప్రాణాలు, ఆస్తులు సురక్షితంగా ఉండేలా ప్రభుత్వం చేపడుతున్న ప్రమాద నివారణ చర్యలను సమీక్షిస్తూ, సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో అత్యవసరంగా విద్యుత్ శాఖ, రెవెన్యూ, మేజర్ మైనర్ ఇంజనీరింగ్ అధికారులు, ఫారెస్ట్, టెలిఫోన్ డిపార్ట్మెంట్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఆరోగ్య, పశు సంవర్ధక, అగ్నిమాపక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజలలో అపోహలు, ఆందోళనలు వ్యాపించకుండా అధికారులు సమయానుకూల సమాచారాన్ని అందించాలనీ, అవసరమైన చోట పునరావాస కేంద్రాలు, వైద్య బృందాలు, అత్యవసర వాహనాలు సిద్ధంగా ఉంచాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

ఎమ్మార్వో మాట్లాడుతూ మండలంలో లోతట్టు ప్రాంతాలను గుర్తించడం జరిగిందని, తుఫాన్ ప్రభావం వల్ల అధిక వర్షాలు కురిస్తే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే 19 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జె అన్నవరంలో 30, కంబాలపాలెంలో 30, యర్రవరం గ్రామంలో 250 కుటుంబాలకు చెందిన మొత్తం 650 జనాభాకు అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నా మన్నారు. ఏలేశ్వరం మండల రెవెన్యూ కార్యాల యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని విపత్తు తొలగే వరకు 24/7 గంటలు పనిచేసే విధంగా ఏర్పాటు చేశామని, సహాయం కోరే ప్రజలు 7801330188 నంబర్కు ఫోన్ చేయవలసిందిగా ఎమ్మార్వో కోరారు. మండలంలో రైతుల పంట నష్టాలను నివారించేందుకు, పశు సంపద రక్షణ కోసం అగ్రికల్చర్, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖ అధికారులకు తీసుకోవలసిన చర్యలు, రైతుల సహాయ సహకారాల కోసం అధికారులను నియమించడం జరిగిందని మండల స్పెషల్ ఆఫీసర్ సిరిల్ తెలిపారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు మేడిశెట్టి బాబి, ఈవో ఆర్ డి, రామరాజు వర్మ, సీఐ బి. సూర్య అప్పారావు, నాయకులు జ్యోతుల పెదబాబు, అలమండ చలమయ్య, బొద్దిరెడ్డి గోపి, పెంటకోట మోహన్, చిక్కాల లక్ష్మణరావు, జి వి సుబ్బ రాజు, అవసరాల సూర్య ప్రకాష్ రావు, బస్సా ప్రసాద్, మైరాల కనకారావు, బుద్ధ సూర్య ప్రకాష్, పసల సూరిబాబు, కొప్పుల బాబ్జి, జిగటాపు సూరిబాబు, గట్టెం వెంకటరమణ, వివిద శాఖల అధికారులు, ఎన్ డి ఏ కూటమి నాయకులు,12 పంచాయతీల సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు

- ప్రజలకు భరోసాగా నిలుద్దాం
- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ కు మంత్రి సుభాష్ ఆదేశాలు

**అమలాపురం/కాకినాడ,పెన్ పవర్,అక్టోబర్ 28:** మొందా తుఫాన్ ను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని, అలాగే ప్రజల్లో భయాందోళనలు లేకుండా జిల్లా యంత్రాంగం సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ రావిరాలకు సూచించారు. తుఫాను సహాయక చర్యల్లో భాగంగా మంత్రి సుభాష్ కృష్ణాజిల్లా ఇన్చార్జి మంత్రిగా అధికారులతో మంగళవారం ఉదయం సమీక్షించి తధానంతరం కోనసీమ జిల్లాలో పలు మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్ కుమార్ కు పలు సూచనలు చేశారు. వాయుగుండం నేటి రాత్రికి తీవ్ర తుఫానుగా మారనుందని, ఆ సమయంలో ఎక్కడా ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పునరావాస శిబిరాల్లో ఉన్న బాధితులకు నాణ్యమైన భోజనం, మంచినీరు, పాలు, అవసరమైన వారికి మందులు అందించాలన్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, గర్భిణీ స్త్రీలకు మెరుగైన సౌకర్యాలు అందించాలని అన్నారు. తుఫాను తీరం దాటిపోయే వరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్ కుమార్ జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు మంత్రి సుభాష్ కు వివరించారు. అన్ని శాఖల అధికారులను సమన్వయ పరిచి సహాయక చర్యలు చేస్తున్నామన్నారు. కాట్రేనికోన,ఐ పోలవరం, సఖినేటిపల్లి, మల్కిపురం, ఉప్పలగుప్తం, కొత్తపేట మండలాల్లో సుమారు 7000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించమన్నారు. తీర ప్రాంతాల్లో మెరైన్ పోలీసులతో పాటు సుమారు 150 గ్రామ సచివాలయంలో ఉన్న మహిళా పోలీసులతో గస్తీ నిర్వహించమన్నారు. కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు తుఫాను పరిస్థితులను అంచనా వేస్తు ప్రజలను అప్రమత్త%శీ% చేస్తున్నామని మంత్రి సుభాష్ కు వివరించారు.



## ఏటుగట్ల పటిష్టత పై ప్రత్యేక చర్యలు





**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్ 28:**మొంథా తుపాను ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని ఏటి గట్ల పటిష్టతపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని పెద్దాపురం ఆర్డీఓ కె శ్రీ రమణి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు.మొంథా తుఫాను ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని మంగళవారం కిర్లంపూడి మండలం ఏలేరు పరివాహ ప్రాంతాల్లో ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు,మండల ప్రత్యేక అధికారి, శ్రీనివాసుల రెడ్డి, ఎంపీడీఓ,బావిశెట్టి హరికృష్ణ,తహసీల్దార్, జె చిరంజీవి, నీటి పారుదల శాఖ ఏ ఇ శ్రీనివాస్,లతో కలసి పర్యటించి బలహీనంగా ఉన్న ఏటి గట్లను పరిశీలించారు.మొంథా తుపాను ప్రభావం వల్ల ఎవరికి ఎటువంటి నష్టం కలగకుండా చూడాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కొల్లు సర్పంచ్ జ్యోతుల రాంబాబు,ఆయా గ్రామాల రెవెన్యూ అధికారులు,గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## పునరావాస కేంద్రాల పరిశీలనలో బీజేపీ నాయకులు



**కాజులూరు, పెన్ పవర్, అక్టోబర్ 28:** మొంథా తుఫాను ప్రభావం నేపథ్యంలో డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ పిలుపు మేరకు బీజేపీ నాయకులు తాళ్లరేవు, ఐ.పోలవరం మండలాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంగళవారం సందర్శించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాయపురెడ్డి భైరవమూర్తి, మండల నాయకులు సుంకర రామకృష్ణ, పడాల నాని తదితరులు ప్రజల అభ్యంతరాలు, అవసరాలను తెలుసుకున్నారు. అధికారులు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలిస్తూ, పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ధైర్యం చెప్పారు.

## బాధితులకు అన్ని సౌకర్యాలు కల్పించండి



**ఆలమూరు, పెన్ పవర్,అక్టోబర్ 28:**మొంథా తుఫాన్ బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంగళవారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఈదల సత్తిబాబు ఆధ్వర్యంలో ఆలమూరు మండల కూటమి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందుతున్న వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని, ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా వైద్య సిబ్బంది సేవలు అందించాలని సంబంధిత అధికారులకు కూటమి నాయకులు సూచించారు. అలాగే పునరావాస కేంద్రంలో ఉన్న బాధితులను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ మేరకు అధికారులు స్పందిస్తూ బాధితులకు తగిన వసతులు కల్పించామని, మధ్యాహ్న భోజనం పథకం ద్వారా భోజన సదుపాయాలు సకాలంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా బెంగాల్ నుండి వలస వచ్చిన సుమారు 200 మంది బట్టి కార్మికులకు పునరావస కేంద్రాలలో వసతిని కల్పించామన్నారు. పెంకుటిల్లు, పూరి పాకలలో ఉన్నవారు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని సూచించామన్నారు.అనంతరం ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కూటమి నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో ఈదల రాంబాబు, రామానుజుల శేషగిరిరావు, మానేపల్లి శ్రీను, కూటమి నాయకులు,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పునరావాస కేంద్రాలను పరిశీలించిన అధికార బృందం



**ఆలమూరు, పెన్ పవర్,అక్టోబర్ 28:**మొంథా తుఫాను ప్రభావంతో మండలంలో ఏర్పాటు చేసిన 22 పునరావాస కేంద్రాలను మంగళవారం అధికార బృందాలు పరిశీలించారు. ఎంపీడీవో ఏ రాజు ఆధ్వర్యంలో మండల ప్రత్యేక అధికారి లక్ష్మి ప్రత్యూష పునరావాస కేంద్రంలోని సదుపాయాలపై ఆరా తీశారు. బాధితులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న బాధితులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని పాఠశాల సిబ్బందికి సూచించారు.పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. పునరావాస కేంద్రంలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయి, ఎక్కడి నుంచి తరలించారనే పూర్తి సమాచారాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం భోజన పథకం ద్వారా ఏర్పాటుచేసిన పౌష్టికాహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1 బి అప్పాజీ, ఎంఈఓ 2 ఎన్ రాజు, పంచాయతీ కార్యదర్శులు,రెవెన్యూ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, ఏఎన్ఎం,ఆశ, అంగన్వాడి సూపర్ వైజర్లు,వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.ద

## బూరుగుపూడి గ్రామలో గ్రామపంచాయతీ అధికారులు, సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉండాలి..

జనసేన నాయకులు అడపా శ్రీనివాస్..





**కోరుకొండ, పెన్ పవర్, అక్టోబర్ 28:** రాజానగరం ఎమ్మెల్యే బలరామకృష్ణ ఆదేశాల మేరకు పంచాయతి సెక్రటరీని వీఆర్వోని సచివాలయం సిబ్బందిని మరియు మెడికల్ అధికారులతో అందరితో మీటై గ్రామ ప్రజలకు అందరికీ ఇరవై నాలుగు గంటలు అందుబాటులో ఉండాలని రాజానగరం జనసేన సీనియర్ నాయకుడు అడపా శ్రీనివాస్ అధికారులకు సూచించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబునాయుడుడిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాజనగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశాల మేరకు ముందు జాగ్రత్త చర్యగా తుఫాన్ ప్రభావం వలన బూరుగుపూడి గ్రామంలో మట్టి ఇంటిలో నివాసం ఉంటున్న వారిని గుర్తించి వారిని తుఫాన్ ప్రభావం తగ్గు వరకు దగ్గరలో గల రెండు మండల ప్రజా పరిషత్ స్కూల్ నందు నివాసం ఉండవలసినదిగా సూచించి దగ్గర ఉండి కొంతమందిని తరలించడం అయినది గ్రామ సచివాలయం నందు ఏర్పాటు చేసిన సైక్లోన్ కంట్రోల్ రూమ్ ను సందర్శించి వారు తీసుకున్న ముందస్తు జాగ్రత్తలు తెలుసుకొని వారికి పలు సూచనలు ఇవ్వడమైనది ఈ కార్యక్రమంలో కట్ట వీర సూరి, చిన్న బుజ్జి, సచివాలయం సిబ్బంది గ్రామ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు తాత్కాలిక మరమ్మత్తులు చేయించిన వంటిపల్లి కృష్ణమూర్తి



**ఆలమూరు, పెన్ పవర్,అక్టోబర్ 28:**కొనసీమను వణికిస్తున్న మొంథా తుఫాన్ కారణంగా మండల కేంద్రమైన ఆలమూరులో యూనియన్ బ్యాంకు సమీపంలో ఆర్ అండ్ బి రహదారులపై గుంతలు ఏర్పడి నీరు నిలిచిపోవడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణ సమయంలో గుంతలు గుర్తించ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాధాలకు గురవుతున్నారు. విషయాన్ని గమనించిన ప్రముఖ వ్యాపారవేత్త శ్రీ మురళీకృష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు తండ్రి అయిన వంటిపల్లి కృష్ణమూర్తి తన సామాజిక బాధ్యతను గుర్తుచేసుకుని మరోసారి దాతృత్వాన్ని చాటుకున్నారు.మంగళవారం రాత్రి సమయంలో గాలి వానను సైతం లెక్కచేయకుండా ఆయన సొంత నిధులతో భారీ ప్రోక్లైన్ ఏర్పాటుచేసి ఆర్ అండ్ బి రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.వ్యక్తిగత ప్రమాదాన్ని పట్టించుకోకుండా వాహనదారులు సురక్షితంగా ప్రయాణించాలనే ముఖ్య ఉద్దేశంతో తన సేవలను అంకితం చేశారు. దీనితో ఆ ప్రాంతంలో వాహన రాకపోకలు సజావుగా సాగుతున్నాయి. ఈ మేరకు పలువురు ఆయనను అభినందించారు. అయితే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు,సహాయ సహకారాలు అందిస్తున్న కృష్ణమూర్తి కుటుంబం ఇటువంటి సేవల్లో కూడా ముందంజలో ఉండటం అనేకులకు, గ్రామ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

# ప్రమాదకర ప్రదేశాలను పరిశీలించిన పోలీస్ రెవెన్యూ సిబ్బంది







**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 28:**తుఫాన్ నేపథ్యంలో మండలంలోని పలు ప్రమాదకరమైన ప్రదేశాలను తాసిల్దార్ శ్రీనివాసరావు, ఎస్సై వెంకటేష్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు పరిశీలించారు. మండలంలోని సూరంపాలెం రిజర్వాయర్ వద్ద పోలీస్ రెవెన్యూ సచివాలయ సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. ప్రాజెక్ట్ పరిసరాల్లోకి ఎవరిని వెళ్ళనివ్వకుండా పహారా కాస్తున్నారు. అలాగే నెల్లిపూడి గ్రామ శివారులో గల కల్వర్టు వద్ద పాత రామవరం చెరువు వద్ద వేము లోవ తదితర ప్రాంతాల్లో గల ప్రమాదకర ప్రదేశాలను వారు పరిశీలించి ఆ ప్రదేశాల్లో నియమించిన సిబ్బందికి పలు సూచనలు చేశారు. కొండ వాగులు చెరువులు ప్రాజెక్టు వద్ద చేపల వేట చేపట్టవద్దని అత్యవసరమైతేనే ఇళ్ల నుండి బయటికి రావాలని పలు గ్రామాల్లో గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

## శ్రీరంగపట్నం పునరావాస కేంద్రాన్ని పరిశీలన..



రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి..

**కోరుకొండ, పెన్ పవర్, అక్టోబర్ 28:** మొంథా తుఫాను నేపథ్యంలో రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ మండలంలో సహాయక చర్యలను పర్యవేక్షించిన రుడా చైర్మన్ తెలుగుదేశం పార్టీ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి పరిశీలించారు. మంగళవారం ఉదయం తుఫాను తీవ్రత దృష్ట్యా ప్రజల భద్రతను పర్యవేక్షించేందుకు, కోరుకొండ మండలం, శ్రీరంగపట్నం గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో కల్పించిన వసతులను, తాగునీరు,ఆహారం, వైద్య సదుపాయాల ఏర్పాట్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.

అధికారులకు పలు సూచనలు పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను బొడ్డు వెంకటరమణ చౌదరి ఆదేశించారు.ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, పిల్లలకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి అవసరమైన అదనపు సౌకర్యాలను కల్పించాలని సూచించారు.తుఫాను పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు ప్రజలు సురక్షితంగా ఉండేలా చూడాలని, గ్రామస్థాయిలో సహాయక చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.తుఫాను ప్రభావంతో ఏమైనా నష్టాలు సంభవిస్తే, తక్షణమే స్పందించి తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా విద్యుత్, రోడ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ప్రజలతో ఆయన నేరుగా మాట్లాడి,వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు కూడా తుఫాను సహాయక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, అధికారులకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. తుఫాను ముప్పు తొలగిపోయేంత వరకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ యంత్రాంగం ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు

## గిరిజనేతర నిర్వాసితులకు తిరువూరులో పునరావాసం కల్పించాలి.



- టిడిపిమండలఅధ్యక్షులు బొర్రానరేష్,కుమార్,
- టిడిపిపార్టీ మండలనాయకులు కార్యకర్తలు

**వి.ఆర్.పురం పెన్.పవర్.అక్టోబర్.28**

ఆంధ్రప్రదేశ్,జలవనరుల శాఖమంత్రి,నిమ్మలరామానా యుడును మంగళవారం టిడిపిమండలఅధ్యక్షులు బొర్రానరేష్,కుమార్,టిడిపి సీనియర్,నాయకులు,బొర్రా నరసింహారావు,టిడిపి మండలనాయకులు కార్యకర్తలు మర్యాద పూర్వకంగాకలసి,వివిధ సమస్యలను పార్టీలేఖ ద్వారా వారికితెలియజేశారు.ఆంధ్రప్రదేశ్,జలవనరు ల శాఖమంత్రికు తెలియజేసిన సమస్యలు పోలవరం ప్రాజె క్టు కారణంగా సర్వంకోల్పోతున్న గిరిజనేతర నిర్వాసితు లకు కోరుకున్నచోట ఐదుసెంట్లు భూమిఇచ్చి,పునరావా సం తిరువూరు కల్పించి,ప్రభుత్వంద్వారాగృహాలు కట్టించి, మౌళిక సదుపాయాలు కల్పించి,పాఠశాలలు,దేవాలయా లు ఏర్పాటు చేయాలని,శ్మశానవాటిక నిర్మించాలి.18సం వత్సరాలు నిండిన యువతీయువకులు 2022కటాఫ్, డేట్,కారణంగా ఇబ్బందులుపడుతున్నారు.2022కటాఫ్. డేట్,ను మార్చివారికి కూడా న్యాయంచేయాలని,గృహాల కు స్థలాలు ఇచ్చి,నిర్మాణం కల్పించాలి.వి.ఆర్.పురంలో35 బి.సి.కాలనీలోసుమారు220 రామవరంలో104 గృహాల విలువలు పెండింగ్,లో ఉన్నాయి.సంబంధిత గృహాలను సర్వేలు నిర్వహించి,వారికిన్యాయం చేయాలని, ప్రతి ని ర్వాసితుల కుటుంబానికి పోలవరం ప్రాజెక్టు మరియు దా నిఅనుబంధ పరిశ్రమలలో యాబైశాంతం ఉద్యోగాలు కల్పించాలని,తెలియ చేశారు.ఈకార్యక్రమంలో వివిధ పార్టీల మండలనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపాలెం గ్రామంలో పునరావాస కేంద్రం ఏర్పాటు







**కాజులూరు, పెన్ పవర్, అక్టోబర్ 28:** మొంథా తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని మండల రెవిన్యూ అధికారులు పలు గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాజులూరు హైస్కూల్, గొల్లపాలెం హైస్కూల్, ఉప్పుమిల్లి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో ప్రజలకు రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు సహాయసేవలు అందిస్తున్నారు. గొల్లపాలెం గ్రామంలో కమిటీ అధ్యక్షులు నక్క శ్రీను, అత్తిలి వెంకటరమణ, రేకపల్లి సత్తిబాబు, మెడికల్ సిబ్బంది కలిసి పూరి గుడిసెల్లో నివసిస్తున్న వృద్ధులు, మహిళలను ఇంటింటికి వెళ్లి పునరావాస కేంద్రాలకు తరలించారు. కొంతమందిని స్వయంగా బైక్‌లపై తీసుకువచ్చి సురక్షిత ప్రాంతాల్లో ఉంచారు.కాజులూరులో యువత ముందుంటూ పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి అవసరమైన సేవలు అందించారు. ఇంటినుంచి రాలేని వృద్ధులకు పాలప్యాకెట్లు, రొట్టెలు స్వయంగా అందించారు.ఉప్పుమిల్లి గ్రామంలో ఎంపీటీసీ కొప్పిశెట్టి కృష్ణ మూర్తి,సచివాలయ సిబ్బందితో కలిసి తుఫాన్ నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ, ఎవరు భయపడవద్దని ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించు కోవాలని సూచించారు. అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.శలపాక, ఒంటి తాడి గ్రామాల్లో సర్పంచ్ పోతుల గనిరాజు, నెల్లి బ్రహ్మాజీ గొడుగులు పట్టుకొని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు పంచాయతీ సిబ్బంది తో ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులకు ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చవ్వాకుల డాక్టర్ బాబు, దడాల నాగార్జున, నక్క శ్రీను, పోతురాజు భీమారావు ,రెవెన్యూ, సచివాలయం, మెడికల్ సిబ్బంది తదితర కూటమి నాయకులు పాల్గొని సేవలందించారు.

# తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పర్యటన.



**ఏలూరు అక్టోబర్ 28 పెన్ పవర్ :** ఏలూరు జిల్లాలోన తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పర్యటించారు. ఉదయం జోరువానలోనే కొల్లేరు బయలుదేరిన ఎంపీ, కైకలూరు సమీపంలో మాదేపల్లి గ్రామంలో పంట పొలాల వద్ద రైతులతో మాట్లాడారు. కొల్లేరు సమీపంలో చెరువుల వద్ద ఆక్వా రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. కైకలూరు నుంచి ఉప్పుటేరు బ్రిడ్జి వద్దకు చేరుకున్న ఎంపీ ఉప్పుటేరు నీటి ఉధృతిని పరిశీలించారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన ఉండి ఎమ్మెల్యే, శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు తో కలిసి ఉప్పుటేరు ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం ఎంపీ పుట్టా మహేష్ మీడియాతో మాట్లాడారు. తుఫాన్ పరిస్థితులపై ప్రభుత్వం, అధికారులు అప్రమత్తంగా ఉన్నారని, ఎటువంటి ప్రాణ నష్టం జరక్కుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు,నారా లోకేష్ నిరంతరం పరిస్థితులను సమీక్షిస్తున్నారని, ప్రజా ప్రతినిధులంతా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోనే ఉండి, సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని ఎంపీ తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఆహారం, అత్యవసర వైద్యం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అనంతరం అక్కడినుంచి కైకలూరు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన తుఫాను పునరావాస కేంద్రాన్ని సందర్శించిన ఎంపీ వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పునరావాసం పొందుతున్న వ్యక్తులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. సాయంత్రం ముదినేపల్లి మండలం పెనుమల్లి గ్రామంలో కూటమి పార్టీల కార్యకర్తలతో భేటీలో పాల్గొన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తుఫాను సహాయ చర్యల్లో పాల్గొనాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రజలు కూడా అధికారుల సూచనలు పాటించి జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.అత్యవసరం అయితే ఏలూరు కలెక్టరేట్ వద్ద కంట్రోల్ రూమ్ నెంబర్ 1800-233-1077, 94910 41419 ఫోన్ నెంబర్ల లేదా ఏలూరు ఎంపీ క్యాంపు కార్యాలయ నంబర్స్ 91 96181 94377, 91 98855 19299 కు ఎవరైనా కాల్ చేయవచ్చని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు.

# తుఫాను ధాటికి నేలకొరిగిన కొబ్బరిచెట్లు,





**స్తంభించిన జనజీవనం.అంధకారం లో గ్రామాలు.**

**అధికార్ల పర్యవేక్షణ పునరుద్ధరణ.**

**కపిలేశ్వరపురం పెన్ పవర్ అక్టోబర్ 28 :**డాక్టర్ బి అర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం లో గ్రామాల్లో మంగళవారం తుఫాను ప్రభావం తో జనజీవనం స్తంభించింది.భారీ ఈదురుగాలులకు కొబ్బరి చెట్లు చిగురాకులులా తిరిగి విరిగాయిమాచర గ్రామ సొసైటీ వద్ద , టేకీ కోరుమిల్లి ఆర్ అండ్ బి ప్రధాన రహదారి మార్గం పై కొబ్బరి చెట్లు గాలులకు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి.జిల్లాఉన్నత అధికార్లు ఆదేశానుసార ంరెవిన్యూ,పంచాయతీ, ట్రాన్కోవైద్య ఆరోగ్య ,తదితర మండల స్థాయి,గ్రామ స్థాయిలో ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో తుఫాను బాధిత కుటుంబాల వారిని ప్రభుత్వ పాఠశాలలో తరలించి, పునరావాసం ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులుశ్రేణులు శిధిల భవనాలు, పూరి గుడిసెలు లో నివసిస్తున్న కుటుంబాల్ని గుర్తించి,ప్రభుత్వ పాఠశాలలకు తరలిస్తున్నారు. ముంతా తుఫాన్ ప్రభావం తగ్గేవరకు బాధిత కుటుంబాలకు పునరావాస శిబిరాలు లోనే రాత్రి, పగలు బోజన వసతి,త్రాగునీరు,వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు రెవిన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్, వైద్య ఆరోగ్య , ట్రాన్సో తదితర శాఖల అధికారులు మంగళవారం మీడియా కు తెలిపారు. తుఫాన్ ప్రభావం తగ్గేవరకు బయటకు వెళ్లడం శ్రేయస్కరం కాదని, సురక్షిత భవనాల లోనే తలదాచుకోవాలని జయ బాబు విజ్ఞప్తి చేశారు. ప్రతీ పునరావాస కేంద్రం వద్ద మెడికల్ శిబిరాలు నిర్వహిస్తున్నారు. టేకి గ్రామం జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాల లో ఏర్పాటు చేసిన తుఫాన్ బాధితుల శిబిరాన్ని మండపేట నియోజక నాయకులు వివిధ శాఖల ఉద్యోగ సిబ్బంది పరామర్శించి సదుపాయాలు,అవసరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

# రంపచోడవరం కేంద్రంగా ఏజెన్సీ జిల్లా ప్రకటించాలి గిరిజన సంఘం

**చింతూరు, పెన్ పవర్ అక్టోబర్ 28:**రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించిన ఈ సమయంలో, రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక ఏజెన్సీ జిల్లాను ఏర్పాటు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం చింతూరు మండల గిరిజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన సురేష్ మాట్లాడుతూ, రంపచోడవరం, చింతూరు, పోలవరం సహా మొత్తం 14 ఏజెన్సీ మండలాలను కలుపుతూ ఒక ప్రత్యేక జిల్లా ఏర్పాటు అవసరమని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజలు నిర్వాసిత సమస్యలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం జిల్లా కేంద్రం పాడేరుకు వెళ్లాలంటే సుదీర్ఘ ప్రయాణం, సమయనష్టం ఎదురవుతోందని చెప్పారు. గత ఎన్నికల సమయంలో కూడా ముఖ్యమంత్రి రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చిన విషయం గుర్తుచేస్తూ, ఆ హామీని నెరవేర్చాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత ఆదివాసీల హక్కులు పటిష్టంగా అమలు కావాలంటే రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు తప్పనిసరి అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధి దిశగా ఆలోచించి, రంపచోడవరం జిల్లాగా ప్రకటించి ప్రజానీకానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో చింతూరు మండల కార్యదర్శి ముట్టం రాజయ్య, ఎంపిటిసి తుమ్మల రాజ్ కుమార్, గిరిజన సంఘం నాయకులు సోడే సాయి, లక్ష్మణ్, నాగార్జున్, మడివి రామారావు తదితరులు పాల్గొన్నారు.



# సమన్వయంతో తుఫాన్ ను సమర్ధంగా ఎదుర్కొందాం.

- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి వాసంశెట్టి సుభాష్.
- అండగా ఉండి ఆదుకుంటామని ప్రజలకు భరోసా.

**కె గంగవరం పెన్ పవర్ అక్టోబర్ 28:**

ప్రకృతి విపత్తు సమయాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం కె గంగవరం మండలంలోని పామర్రు, కూళ్ల, సుందరపల్లి, మసకపల్లి తదితర గ్రామాల్లో తుఫాను ప్రభావిత ప్రాంతాలు, పునరావాస శిబిరాలను మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం పరిశీలించారు. మంత్రి సుభాష్ వెంట కూటమి పార్టీ సీనియర్ నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, స్వచ్ఛ భారత్ డైరెక్టర్ సలాది రమేష్, గంగవరం మండల టిడిపి అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, రామచంద్రపురం పట్టణ అధ్యక్షులు ఉండవెల్లి శివ, మరివాడ సూరిబాబు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ పురావాస శిబిరంలో ఉన్న బాధితులతో మాట్లాడి అక్కడ అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. తుఫాన్ సహాయక చర్యలను స్వయంగా పరిశీలించారు. ఈ రాత్రికి వాయుగుండం తీరం దాటే అవకాశం ఉన్నందున అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని అక్కడ ఉన్న అధికారులను ఆదేశించారు. ముందస్తు రక్షణ చర్యలుగా తుపాను ముప్పు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని ప్రజలకు ధైర్యం చెప్పారు. అధికారులు సమన్వయంతో పని చేసి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ పునరావాస కేంద్రంలో వైద్య శాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలని, ముఖ్యంగా వృద్ధులకు, పిల్లలకు, గర్భిణీ స్త్రీల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. తుఫానును సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా సిద్ధంగా ఉందన్నారు.

సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రొట్టెలు, దుప్పట్లు, బిస్కెట్లు పంపిణీ.

తుఫాను పునరావాస శిబిరాల్లో ఉన్న బాధితులకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం సమకూర్చిన దుప్పట్లు,రొట్టెలు, బిస్కెట్ ప్యాకెట్లు, తినుబండారాలు పంపిణీ చేశారు. సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా ఈ వస్తువులు పంపిణీ చేసినట్టు సత్యం తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ పాలు పంచుకుంటుందన్నారు. ఈ వస్తువుల కిట్టు ను మంత్రి సుభాష్, పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి పార్టీ నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ తుఫాన్ ను సమర్ధంగా ఎదుర్కొనేందుకు అధికారులు, కూటమి నాయకులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. అపార అనుభవం ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు ముందస్తుగా ఎలాంటి నష్టం వాటిల్లకుండా తగు చర్యలు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.





# హుకుంపేట గ్రామ పునరావాస కేంద్రం ఆర్డీవో నాయక్ పరిశీలన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 28:**రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్. కృష్ణ నాయక్ మంగళవారం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు రూరల్ మండలం హుకుంపేట (డి-బ్లాక్) గ్రామంలోని పంచాయతీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన తుఫాన్ సహాయ పునరావాస శిబిరాన్ని రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరంలో వసతి, ఆహారం, తాగునీరు, శానిటేషన్ , వైద్య సదుపాయాల ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. తుఫాన్ ప్రభావిత కుటుంబాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చూడాలని, శిబిర పరిసరాల్లో పరిశుభ్రతను నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్ ఆదేశించారు.

రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో మొంథా తుఫాను నేపథ్యంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు, అవసరమైన ఔషధ నిల్వలు, ఆహార సరఫరా, సురక్షిత వసతి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అధికారులు సూచనలు మేరకు సురక్షితంగా వాతావరణ పరిస్థితులు అదుపులోకి వచ్చే వరకు పునరావాసం కల్పించడం జరిగిందని, ఆమేరకు సహకరించాలనీ కోరారు.

## మొంథా తుఫాను రక్షణ, సహాయ చర్యలు జోరుగా

**35,114 మందిని పునరావాస కేంద్రాలకు తరలింపు**

**జిల్లా వ్యాప్తంగా 401 పునరావాస కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం**



**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 28:**తీర, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న 35,114 మందిని ఇప్పటికే పునరావాస కేంద్రాలకు తరలించి, అవసరమైన అన్ని వసతులు కల్పించామని డా. బి. షణ్మోహన్ సగిలి, జిల్లా కలెక్టర్ తెలిపారు.మొంథా తుఫాను నేపథ్యంలో మంగళవారం సాయంత్రం వరకూ చేపట్టిన రక్షణ, సహాయక చర్యల వివరాలను వెల్లడిస్తూ కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు.తుఫాను ప్రభావానికి జిల్లాలో 12 మండలాల్లోని 68 గ్రామాలు, 5 పట్టణాల్లో కలిపి 41,729 మంది ప్రభావితం అయ్యే అవకాశం ఉందన్నారు.మొత్తం 401 పునరావాస కేంద్రాలు సిద్ధంగా ఉంచగా, వాటిలో 81 కేంద్రాలను ఇప్పటి వరకూ ప్రారంభించి ప్రజలను సురక్షితంగా ఉంచామన్నారు. ప్రభావిత ప్రజలకు 45,700 ఆహార ప్యాకెట్లు, 2,463 వాటర్ కేన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. 24 ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా జరుగుతుందని వివరించారు. అదనంగా 1.50 లక్షల లీటర్ల పాలు, 16 మంది బ్రెడ్ వెండర్లు, 191 మంది ఫుడ్ సప్లైయర్లను సిద్ధం చేసామన్నారు. ఐసిడిఎస్ ద్వారా 1,400 మంది బాలింతలు, 21,459 మంది చిన్నారులకు పాలు, గుడ్లు పంపిణీ జరుగుతున్నాయని వెల్లడించారు.

అత్యవసర వైద్య సేవలుజిల్లాలో 259 మెడికల్ క్యాంపులు నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టి, 185 మంది వైద్యులు, 1,710 మంది వైద్య సిబ్బందిని నియమించామని తెలిపారు. అదనంగా 108 అంబులెన్సులు 23, 104 సంచార వైద్య వాహనాలు 35, 102 వాహనాలు 22 అందుబాటులో ఉన్నాయన్నారు. యాంటీ రాబీస్ వాక్సిన్లు 7,150 డోసులు, యాంటీ స్నేక్ వెనం 1,773 డోసులు, 2.50 లక్షల క్లోరిన్ టాబ్లెట్లు అందుబాటు లో ఉంచామన్నారు.95 మంది గర్భిణు లను,1,400 మంది బాలింతలను 52 ఆసుపత్రులలో వైద్య పర్యవేక్షణలో ఉంచామ న్నారు.పాఠశాలలు,విద్యార్థుల భద్రతజిల్లాలో అన్ని పాఠశాలలకు సెలవులు ప్రకటించి, హాస్టళ్లలో ఉన్న 14,499 మంది విద్యార్థులను సురక్షితంగా ఇంటికి పంపామని తెలిపారు.పశువుల రక్షణ9,901 పశువులను సురక్షిత ప్రదేశాలకు తరలించామని, 52 మంది పశు వైద్యులతో 30 క్యాంపులు ఏర్పాటు చేసి, 200 మెట్రిక్ టన్నుల పశుగ్రాసం, 17,000 వ్యాక్సిన్లు సిద్ధం ఉంచామని వివరించారు. మత్స్యకారులు అప్రమత్తంగాసముద్రంలో వేటకు వెళ్లిన బోట్లన్నిటినీ తీరానికి రప్పించి, 4,573 బోట్లను క్రీక్, ఉప్పుటేరు ప్రాంతాల్లో సురక్షితంగా నిలపాలని సూచించామని తెలిపారు.కంట్రోల్ రూమ్‌లు, కమ్యూనికేషన్జిల్లా, డివిజన్ కేంద్రాలతోపాటు 21 మండలాల్లో 24%ఇ%7 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు.తాళ్లరేవు, కొత్తపల్లి ప్రాంతాల్లో శాటిలైట్ ఫోన్లు, 85 వీహెచ్ఎఫ్ సెట్లను వినియోగంలోకి తెచ్చామని తెలిపారు.రక్షణ బృందాల సిద్ధం ఎన్ డి ఆర్ ఎఫ్ రెండు బృందాలు (ప్రతీ బృందం 30, 24 మంది), ఎస్ డి ఆర్ ఎఫ్ బృందం (50 మంది) సేవలకు సిద్ధంగా ఉన్నాయన్నారు.అత్యవసర మేనేవర్‌ల కోసం 214 మంది గజ ఈతగాళ్లను నియమించి, 60 బోట్లు, 50,000 లీటర్ల డీజిల్‌తో సిద్ధంగా ఉంచామని వివరించారు.కాకినాడ అర్బన్, పిఠాపురం, తాళ్లరేవుల్లో హెలిపాడ్లు కూడా సిద్ధం చేశామన్నారు. విద్యుత్, రోడ్ల పునరుద్ధరణవిద్యుత్ వ్యవస్థలో నష్టం జరిగిన చోట్ల వెంటనే పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. 3,000 విద్యుత్ స్థంభాలు, 245 ట్రాన్స్‌ఫార్మర్లు సహా అవసరమైన సామగ్రి అందుబాటులో ఉంచామన్నారు.రోడ్లపై కూలిన చెట్లు, అవరోధాలను తొలగించేందుకు 47 క్రేన్లు, 99 ఎక్స్కవేటర్లు, 26 ఫైర్ టెండర్లు సహా భారీ యంత్రాంగాన్ని వినియోగిస్తున్నట్టు వెల్లడించారు.పౌర సరఫరాలు పుష్కలంగాబియ్యం 49,269 టన్నులు, చక్కెర 296 టన్నులు, నూనె 30,185 పాకెట్లు, కూరగాయలు (ఉల్లిపాయలు, బంగాళాదుంపలు 10 టన్నులు, టమోటా 12 టన్నులు) అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఎలాంటి ఆందోళన అవసరం లేదుఇప్పటి వరకూ అవాంఛిత సంఘటనలు పెద్దగా నమోదు కాలేదని, ప్రజలు ఎటువంటి భయాందోళనకు లోను కాకుండా సహకరించాలని కలెక్టర్ కోరారు.తుపాను తీరం దాటే సమయంలో చెట్లు, స్థంభాల క్రింద ఉండకూడ దని, ఆరుబయట సంచరించ కూడదని హెచ్చరించారు.ఏవైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే కంట్రోల్ రూమ్‌లకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com